నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శుక్రవారం | సెప్టెంబర్ 27, 2024 | www.navatelangana.com

ముప్కాల్‌లో సినిమా షూటింగ్


ఓ సన్నివేశం చిత్రీకరణ

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మండల కేంద్రంలో "గ్యాంగ్ ఆఫ్ గోపాల్ పేట్" అనే సినిమా షూటింగ్‌ను గురువారం నిర్వహించారు. రీల్ రియల్ మూవీ క్రియేషన్ చిత్ర నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ నేపథ్యంతో కూడిన సన్నివేశాలను చిత్రీకరించామని దర్శక నిర్మాతలు మధు మల్లంవైవి, శ్రీఫణీంద్ర, మనీష్‌రెడ్డి తెలిపారు. ఈ చిత్రానికి ప్రముఖ తెలంగాణ గేయ రచయిత కోదారి శ్రీనివాస్ సంగీత దర్శకత్వం వహిస్తున్నట్లు చిత్ర దర్శకులు మధు మల్లం వైవి తెలిపారు. నూతన నటీనటులతో గ్రామీణ నేపథ్యంలో యువతకు స్ఫూర్తిగా నిలిచే కథతో కూడిన సన్నివేశాలు చిత్రీకరించినట్టు వివరించారు. సినీ హీరో నరేష్, హీరోయిన్ లలితపై బావ, మరదళ్ల నేపథ్యంతో కూడిన సన్నివేశాలను చిత్రీకరించారు. కార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్ సంఘీర్, సెట్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పాడైపోయిన డీసీఎం

- 5 గంటలు ట్రాఫిక్ జామ్



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి చౌరస్తాలోని స్పీడ్ బ్రేకర్ వెళ్తున్న ఓ డీసీఎం ప్రయాణించే క్రమంలో ఇంజన్ భాగంలోని రాడ్డు విరిగిపోయింది. దీంతో ఆ డీసీఎం అక్కడే ఆగిపోవడంతో వెనుకాల వచ్చే వాహనాలు నిలిచిపోయాయి. దాంతో సుమారు 5 గంటల వరకు ట్రాఫిక్ జామ్ అయ్యింది. పద్మాజీవాడీ చౌరస్తా నుంచి సదాశివనగర్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఇంతజరిగినా హైవే సిబ్బంది మాత్రం సరైన సమయంలో స్పందించలేదు. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



పోటెత్తుతున్న వరద

- శ్రీరాంసాగర్ 22 గేట్లు ఎత్తివేత
- నిజాంసాగర్ మూడు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

నవతెలంగాణ-మెండోరా/నిజాంసాగర్

ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. వరద ప్రవాహం ప్రాజెక్టులోకి పెరగడంతో మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ప్రాజెక్టు 4 గేట్లను ఎత్తి 12,496 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల ప్రారంభించి క్రమంగా పెంచుకుంటూ గురువారం సాయంత్రం 22 గేట్ల ద్వారా 81,224 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ఎస్కేప్ గేట్ల ద్వారా 1200, వరద కాలువకు 19 వేల క్యూసెక్కులు, 6800 క్యూసెక్కులు కాకతీయ కాలువకు, లక్ష్మి కాలువకు 50 క్యూసెక్కులు వదులుతూ మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి 709 క్యూసెక్కుల నీరు వృథాగా ఆవిరి అవుతుండగా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు 80.501 టిఎంసిల నీటిమట్టం కలిగి ఉంది.

ప్రాజెక్టులోకి కొనసాగుతున్న భారీ వరద..

నిజాంసాగర్ : మండల కేంద్రంలోని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షాలకు గురువారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 16,000 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్ట్ ఏఈఈ శివ అన్నారు. ప్రాజెక్ట్ నిండుకుండలా ఉండటంతో మూడు గేట్ల ద్వారా 21,500 క్యూసెక్కుల వరద నీటిని దిగువ మంజీరా నదిలోకి వదులుతున్నట్లు ఆయన తెలిపారు. నది పరివాహక ప్రాంతాలలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలకు గానూ ప్రస్తుతానికి ప్రాజెక్టులో 17.802 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కొత్త ఎంఈవోలతో విద్యాశాఖ గాడిలో పడేనా..?

- బాన్సువాడ డివిజన్ పరిధిలో గతంలో ముగ్గురే ఎంఈవోలు
- ప్రస్తుతం అన్నీ మండలాలకు విద్యాశాఖ అధికారులు

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)



ఇన్‌ఛార్జ్ మండల విద్యాశాఖ అధికారుల పాలనలో విద్యాశాఖ గాడి తప్పింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం మండల నోడల్ అధికారులకు మండల విద్యాధికారులుగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేయడంతో బుధవారం పలు మండలాలకు మండల విద్యాశాఖ అధికారులుగా బాధ్యతలను చేపట్టారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓల పాలనలో విద్యాశాఖ గాడిలో పడుతుందా లేదా అన్న సందేహం విద్యార్థుల తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతోంది.

బాన్సువాడ డివిజన్ పరిధిలో 11 మండలాలకు గానూ ముగ్గురు రెగ్యులర్ ఎంఈవోలుగా విధులు నిర్వహించారు. ఇందులో పిట్లం రెగ్యులర్ ఎంఈఓ పరిధిలో నిజాంసాగర్, కొడప్‌గల్, మొహమ్మద్‌నగర్ ఉండగా.. మద్నూర్ మండల ఎంఈఓ పరిధిలో జుక్కల్, బిచ్కుంద, డోంగ్లి మండలాలు ఉండేవి. ఇక బాన్సువాడ మండల విద్యాశాఖ అధికారి పరిధిలో బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాలకు ఇన్‌ఛార్జ్‌లుగా పనిచేశారు. ఒక్క ఎంఈఓకు మూడు నుంచి నాలుగు మండలాలు ఇన్‌ఛార్జ్‌గా ఉండడంతో మండల గ్రామస్థాయి ప్రభుత్వ పాఠశాల పాలన గాడి తప్పింది. మన ఊరు మనబడి అమ్మ ఆదర్శ పాఠశాల నిధులు దుర్వినియోగమైనట్టు పాఠశాల కమిటీలు ఆరోపించాయి. విద్యాశాఖ ఇన్‌ఛార్జ్ పాలనలో కుంటుపడిది.

సమస్యల నిలయం ఎంఈఓ ఆఫీస్..

ఒక్కొక్క మండల విద్యాశాఖ కార్యాలయంలో ఒక్కొక్క సమస్య నెలకొంది. ఒక మండలంలో ఎంఎల్ఎస్ కోఆర్డినేటర్ పోస్టు ఖాళీ ఉండగా మరో మండలంలో కంప్యూటర్ ఆపరేటర్ లేకపోవడంతో విద్యాశాఖ కార్యాలయంలో జరగవలసిన పనులు సక్రమంగా జరగకుండా ఆలస్యంగా జరుగుతున్నాయని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని మండలాల్లో ఆఫీస్ మెసెంజర్లు లేకపోవడంతో ఉద్యోగులే ఆఫీస్ శుభ్రం చేసుకునే పరిస్థితి ఏర్పడింది. మండల కార్యాలయాల్లో పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కీలకమైన పోస్టులన్నీ ఖాళీగా ఉండటంతో పరిపాలన గాడి తప్పుతోంది. పర్యవేక్షణాధికారుల కొరతతో పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు అడుగంటిపోయాయి. బాన్సువాడ డివిజన్ కొన్ని పాఠశాలలు దశాబ్దకాలంగా వార్షిక తనిఖీలకు నోచుకోలేదంటే డివిజన్ విద్యాశాఖ పనితీరు ఎంత అధ్వానంగా ఉందో తెలుస్తోంది. మండల స్థాయి అధికారుల పోస్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి.

కొత్త ఎంఈఓలతో విద్యాశాఖ గాడిలో పడేనా..

మండల విద్యాశాఖ కార్యాలయంలో పాలన విభాగం సిబ్బంది లేక పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువులు గాలిలో దీపంలా మారాయి. బాన్సువాడ డివిజన్ పరిధిలో 11 మండలాల్లో ముగ్గురే ఎంఈఓలు ఉండగా మిగతా చోట రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో పాఠశాలల ఆకస్మిక సందర్శనలు, వార్షిక తనిఖీలు మందగించాయి. ఫలితంగా పాఠశాలల పనితీరు దిగజారింది. డివిజన్ పరిధిలో విద్యాప్రమాణాలు కూడా ఆశించిన స్థాయిలో మెరుగవడం లేదనే ఆరోపణ ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మండల నోడల్ అధికారులకు మండల విద్యాధికారులుగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేయడంతో పలు మండలాలకు మండల విద్యాశాఖ అధికారులుగా బాధ్యతలను చేపట్టారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఇప్పటికైనా గాడిలో పడుతుందా లేదా అన్నది వేచి చూడాల్సిందే.

వీరనారి.. ఐలమ్మ


కామారెడ్డి: ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి/నిజామాబాద్ సిటీ

భూమి కోసం, భుక్తి కోసం పోరాటం సల్పిన వీరనారి చిట్యాల ఐలమ్మ అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా గురువారం స్థానిక రోడ్లు భవనాల శాఖ విశ్రాంతి భవనం సమీపంలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించా రు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కే వెంకటరమణా రెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, ఆర్డీఓ రంగనాథ్ రావు, మున్సిపల్ కమిషనర్ సుజాత, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, ఇన్చార్జి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి చందర్ నాయక్, స్థానిక ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట స్ఫూర్తి.. ఐలమ్మ : ఎస్పీ సింధూ శర్మ

తెలంగాణ సాయుధ పోరాటంలో ఉవ్వెత్తున ఎగిసే ఉద్యమానికి ఊపిరి పోసి తన ప్రాణాలను త్యాగం చేసి ఉద్యమ స్ఫూర్తి నింపిన వీర వనిత చిట్యాల ఐలమ్మ అని జిల్లా ఎస్పీ సింధు శర్మ అన్నారు. ఆమె జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి నివాళులుర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సాయుధ పోరాట కాలంలోనే తన హక్కుల సాధన కోసం, చట్టం పరిధిలో, కోర్టుల్లో న్యాయం కోసం కొట్లాడిన గొప్ప ప్రజాస్వామికవాది చిట్యాల ఐలమ్మ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో, నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీర వనిత అని అన్నారు. తెలంగాణ స్వాతంత్రోద్యమ సమరయోధులను స్మరించుకోవడం మనందరి బాధ్యతని, వారి ఆశయాలను కొనసాగించాలన్నా రు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కే నరసింహారెడ్డి, ఏఆర్‌డి ఎస్‌పి యాకూబ్ రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ జార్జ్, ఆర్ఎస్ఐలు, డిపిఓ కార్యాలయ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోరాట శక్తికి ప్రతీక ఐలమ్మ : అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్ కుమార్

నిజామాబాద్ సిటీ : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ మహిళా పోరాట శక్తికి ప్రతీక అని అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్ కుమార్ అన్నారు. వీరనారి ఐలమ్మ 129వ జయంతిని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో గల చాకలి ఐలమ్మ విగ్రహానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నగర మేయర్ దండు నీతూకిరణ్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జ్యోతి ప్రజ్వలన చేసి జయంతి కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఐలమ్మ భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరాడిన వీరవనిత అని కొనియాడారు. మహిళ పోరాట శక్తికి ప్రతీకగా నిలిచిన ఐలమ్మ, దొరల ఆధిపత్యానికి వ్యతిరేకంగా జరిగిన రైతాంగ పోరాటానికి ఊపిరిపోసిన యోధురాలని గుర్తుచేశారు. ఐలమ్మ చూపిన తెగువ, శౌర్యం, ధైర్యం ప్రతి ఒక్కరిలో ప్రేరణ కల్పించిందని అన్నారు. ఆమె పోరాట స్ఫూర్తిని నేటి తరం పుణికిపుచ్చుకోవాలనే భావనతో ప్రభుత్వం చాకలి ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందని అన్నారు. ఐలమ్మ ఆశయాలకు అనుగుణంగా, పేదల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు గూపన్పల్లి శంకర్, ప్రధాన కార్యదర్శి ఫతేపూర్ నరేష్, మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు నల్లగంటి శ్రీలత, రాష్ట్ర కార్యదర్శి చెప్యాల బిక్షపతి, సామాజిక కార్యకర్త బంగారు సాయిలు, బీ.సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుస్స ఆంజనేయులు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి డి.రమేష్, సహాయ అభివృద్ధి అధికారులు పి.నర్సయ్య, సి.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


కామారెడ్డి: ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన కలెక్టర్, ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్


నిజామాబాద్ సిటీ: ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అదనపు కలెక్టర్

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్


వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ ప్రధాన కార్యదర్శి

నవతెలంగాణ-కంఠేశ్వర్

కలెక్టరేట్‌లో శానిటేషన్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. గురువారం ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేబర్ కార్యాలయంలో నిజామాబాద్ ఇన్‌చార్జి డిసిఎల్ యోహానుకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. జిల్లా కలెక్టరేట్‌లో శానిటేషన్ నిర్వహణ కొరకు ఏజెన్సీ వాచల్య ఎంటర్‌ప్రైజెస్ ద్వారా పద్ధతిలో పనిచేయించుకోవడానికి నియమించుకున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు గత 2 సంవత్సరాలుగా చట్టప్రకారం కనీస వేతనాలు చెల్లించటంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ అమలు జరపటంలో కూడా నిబంధనలు పాటించటం లేదన్నారు. గుర్తింపు కార్డులు లేకపోవడంతో కార్మికులకు కనీస వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ, అమలు కావడం లేదన్నారు. వారంతపు సెలవులను, పండగ సెలవులను అమలు చేయాలని, కార్మికులకు రక్షణ కల్పించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అలకానంద, నవనీత, లక్ష్మి, పద్మ, రమా, హేమా, సవిత, నర్సమ్మ మీనా, ఆశ బాయి, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల బకాయి వేతనాలు మంజూరు చేయాలి

- మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి


వినతిపత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

నవతెలంగాణ-ఎడపల్లి

నిజామాబాద్ జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులకు బకాయి వేతనాలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని మధ్యాహ్నం భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని మండల శాఖ విద్యాధికారి కార్యాలయంలో వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతినెల ప్రభుత్వం ద్వారా మంజురయ్యే వేతనాలను సక్రమంగా చెల్లించాలని అన్నారు. 2023 అక్టోబర్ నెల మాసానికి చెందిన తమ గౌరవ వేతనాన్ని ఇప్పటివరకు మంజూరు చేయలేదన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా అదనపు స్లాబ్ రేట్లతో పాటు ప్రభుత్వం బకాయి వేతనాలను మంజూరు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. గృహలక్ష్మి పథకం కింద మధ్యాహ్నం భోజన కార్మికులకు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా మంజూరు చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులుగా పనిచేస్తున్న వారందరికీ నెలకు కనీస వేతనం రూ.10వేలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండలాధ్యక్షురాలు దేరడి లక్ష్మి, సావిత్రి, సుమేధ, జక్కం పోశెట్టి, స్వప్న, జయలక్ష్మి, స్వప్న కవిత, గంగామణి, షబానా తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల రాత పరీక్షకు 9 మంది గైర్హాజరు

నవతెలంగాణ-బోధన్

బోధన్ డివిజన్‌లో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల నియామకం కోసం గురువారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభ్యర్థులకు రాత పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్ష రాసేందుకు 180 మంది దరఖాస్తు చేసుకోగా 171 మంది పరీక్షకు హాజరయ్యారు. 9 మంది గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం నోడల్ ఆఫీసర్ తహసీల్దార్ విట్టల్ తెలిపారు. బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఆదేశాల మేరకు నోడల్ ఆఫీసర్ తహశీల్దార్ విట్టల్, ఆర్ఐ వరుణ్, పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఎడపల్లి

మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎడపల్లి ఎంపీడీవో శంకర్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రత్యేక అధికారి ప్రదీప్ కుమార్ అధ్యక్షతన జరిగే సమావేశానికి, విద్యా, వైద్య, ఆరోగ్య, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని సూచించారు.

అధ్వాన్నంగా రోడ్లు

- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-బీబీపేట్

మండల కేంద్రం నుంచి ఉప్పరపల్లి-ఇస్సానగర్ గ్రామాలను కలుపుతూ రామాయంపేట వరకు వెళ్లే రోడ్డు గుంతలతో ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం వర్షాకాలం కారణంగా అనేక గుంతలు ఏర్పడటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనికి తోడు బీబీపేట్ పెద్ద చెరువు కట్టపైన ఏర్పడిన గుంతలలో మండల కేంద్రానికి సరఫరా అవుతున్న పైప్‌లైన్ పగిలి నీరు ఉబికి వస్తోంది. గుంతలలో నీరు ఏర్పడి ఎక్కువ మొత్తంలో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే బీబీపేట్ చెరువు కట్ట కింద ఉన్న బీటీ రోడ్డుకు ఇరువైపులా ముండ్ల చెట్లు విపరీతంగా పెరగడంతో వాహనదారులకు అనేక ఇబ్బందులు కలుగుతున్నాయని అంటున్నారు. ఏపుగా పెరిగిన ఈ ముండ్లచెట్ల ద్వారా రోడ్డుగుండా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో గత సంవత్సర క్రితం రెండు బైకులు ఢీకొని మృతిచెందిన ఘటనలున్నాయి. సంబంధిత అధికారులు రోడ్డుకు ఇరువైపులు ఉన్న చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఇదిలా ఉంటే బిటిఎస్ నుంచి భూంపల్లి ఎక్స్‌రోడ్డు వరకు నిర్మించిన డబుల్ రోడ్డు పక్కన మిషన్ భగీరథ మంచినీటి పథకం ద్వారా గ్రామాలకు నీరందించే పైప్‌లైన్ల మ్యాన్ హెూల్స్ తెరిచి ఉంచడం వల్ల ప్రమాదాలు తలెత్తుతున్నాయి. మండల కేంద్రంలో ఇస్సానగర్ బైపాస్ వద్ద మ్యాన్ హెూల్స్ తెరిచి ఉండడంతో ద్విచక్ర వాహనాలు, అదుపుతప్పి అందులో పడిపోతున్నాయి. మ్యాన్ హెూల్‌లను మూసే ఉంచాలని వాహనదారులకు కోరుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


గుతంతల మయంగా ఉన్న రోడ్డు

మహిళాశక్తి కార్యక్రమాలు సక్రమంగా అమలు చేయాలి

- డీఆర్డీఏ పీడీ సాయగౌడ్


మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ సాయగౌడ్

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళాశక్తి కార్యక్రమాలను గ్రామాలలో సక్రమంగా అమలు చేయాలని డీఆర్డీఏ పీడీ సాయగౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో బోధన్ డివిజన్ ఏపీఎం, సీసీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళ సమాఖ్య ద్వారా గ్రామీణ ప్రాంత మహిళలకు అందుతున్న కార్యక్రమాలను సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా గేదెలు, కోళ్ళ, పిషనరీ, క్యాంటీన్లు, ఈవెంట్స్ మేనేజ్‌మెంట్, మీసేవా, వేస్ట్ మేనేజ్‌మెంట్, కస్టంయిడ్ సెంటర్, సోషల్ మొటలైజేషన్, న్యూ ఎంట్రర్‌ప్రైజెస్ మొదలైన అంశాలను పకడ్బందీగా అమలు జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమాలను సెప్టెంబర్ 30వ తేదీ వరకు గుర్తించి ఆన్లైన్‌లో ఎంట్రీ చేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేసిన వారిపై చర్యలు తీసుకోనున్నట్టు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏపీడీ రవీందర్, డీపీఎంయూ సంధ్యారాణి, నీలిమ, మారుతి, సాయిలు, ఏపీఎం వినోద్ కుమార్, గంగారాం పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారంకోసం ఈనెల 30ఇందిరా పార్క్‌వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్ యూనియన్ జిల్లా నాయకులు జేపీ గంగాధర్ కోరారు. గురువారం మండలం లోని మెంట్రాజ్ పల్లి గ్రామ పంచాయతీ వద్ద ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మోడీ కార్మిక చట్టాలను మార్చేసి 4 లేబర్ కోడ్లను తీసుకువచ్చి కార్మికులకు ఉరితాడు చట్టాలు తెచ్చాడని విమర్శించారు. పంచాయతీ కార్మికులు చాలీచాలని జీతాలతో వేట్టి చాకిరి చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పది నెలలు ఇప్పటికీ గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయక ఈఎస్ఐ పిఎఫ్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నాలుగు చట్టాలను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్ షేక్ ఆసిఫ్, సిబ్బంది ఉన్నారు.

ఫిట్స్‌తో యువకుడు మృతి



నవతెలంగాణ-మాక్లూర్

ఆలూరు మండలంలోని కల్లెడ గ్రామంలో ఫిట్స్ తో యువకుడు మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ గురువారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం కల్లెడ గ్రామానికి చెందిన రంగం మహేష్(28) బుధవారం ఉదయం 06 గంటలకు చికెన్ షాప్‌కి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్ళాడు. ఫోన్ ఇంట్లోనే ఉంచి వెళ్ళాడు. భార్య శరణ్య రాత్రి 11 గంటల వరకు చూసినా రాలేదు. గురువారం ఉదయం 10 గంటల సమయంలో ఆయన బంధువు రంగం నరేష్ తన వ్యవసాయ పొలం సమీపంలోని మామిడి చెట్టు కింద మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఘటనాస్థలికి పోలీసులు చేరుకున్నారు. మృతునికి ఫిట్స్ ఉందనీ, ఫిట్స్ వల్ల చనిపోయి ఉండవచ్చని వారు అనుమానిస్తున్నామని తెలిపారన్నారు. మృతుని బార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రాహుల్ గాంధీ దేశ ప్రతిష్టకు అవమానం కలిగేలా మాట్లాడారు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రాహుల్ గాంధీ దేశ ప్రతిష్టకు అవమానం కలిగేలా మాట్లాడారని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ అన్నారు. గురువారం బిజెపి జిల్లా కార్యాలయంలో ఎస్సి మోర్చా అధ్యక్షులు బీఆర్ శివప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా రాహుల్‌గాంధీ రిజర్వేషన్ల గురించి మాట్లాడుతూ ప్రజలను మోసం చేస్తూ విదేశీ పర్యటనలకు వెళ్ళినప్పుడు రిజర్వేషన్ల తొలిగింపు గురించి మాట్లాడటం దేశంలో సామాజిక వర్గాలల్లో అల్లర్లు సృషించేలా ఉన్నాయని అన్నారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్లో బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్ర పటాన్ని పెట్టకుండా అవమానించిన పార్టీ కాంగ్రేస్ పార్టీ అని అన్నారు. అప్పుడు అద్వానీ, వాజపాయ్ కొట్లాడి సెంట్రల్ హాల్ లో అంబేద్కర్ ఫోటోని పెట్టించారన్నారు. అధికార దాహంకోసం 100 పైచిలుకు సార్లు రాజ్యాంగాన్ని మార్చారని అన్నారు. సమావేశంలో ఎస్సి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సందీప్, కుమార్, సంజీవ్, పవర్ సాయినాథ్, బాలకృష్ణ, క్యాప్టెన్ రాజు, కిరణ్‌తోపాటు ఎస్సి మోర్చ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమతి లేని అపార్ట్‌మెంట్ల నిర్మాణాలతో నాలాల కబ్జా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు, అనుమతి లేని అపార్ట్మెంట్ల వల్ల నాలాల కబ్జా, మురికి కాలువల్లోని నీరు ఆగిపోయి ఇండ్ల మధ్యనే కుంటలుగా మారడం, కాలువల్లో పడి చిన్న పిల్లలకు ప్రమాదాలు, చనిపోయిన ఘటనలు ఏర్పడుతున్న క్రమంలో గురువారం నిజామాబాద్ వినియోగదారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఆనందనగర్, వర్నీ రోడ్, సరస్వతీ నగర్, గంగస్తాన్, బోర్గాం, గాయత్రి నగర్, పులాంగ్ చౌరస్తా, వినాయక్ నగర్, ఆటో నగర్, కొజ్జా కాలనీ, కెనాల్ కట్టలో అక్రమ కట్టడాలను పరిశీలించారు. వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి ఆద్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి ఉపాధ్యక్షుడు వి.యస్.యస్.వర్మ, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్, సంయుక్త కార్యదర్శులు మహాదేవుని శ్రీనివాస్, గైని రత్నాకర్ వినియోగదారుల సమస్యలపై స్థానికులను చైతన్య వంతులను చేసారు. ఈ సందర్భంగా సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ తెలంగాణా మునిసిపాలీటీల చట్టం 2019 ప్రకారం అక్రమ కట్టడాలు, సెల్లార్లు, అక్రమ హాస్పిటల్స్ నిర్మాణాలను వెంటనే కూల్చి వేసి వినియోగదారుల హక్కులను పరిరక్షించాలని అన్నారు. అక్రమ నిర్మాణాలపై త్వరలో న్యూ డిల్లీ లోని కేంద్ర వినియోగదారుల హక్కుల పరిరక్షణ అథారిటీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఇన్నోవేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ పైన సైన్స్ మేళా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా 28వ జాతీయ ఉత్సవాలలో భాగంగా నిజామాబాద్ జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవంలో భాగంగా గురువారం ఇన్నోవేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ పైన సైన్స్ మేళ జిల్లా కేంద్రంలోని మాణిక్ భవన్ పాఠశాలలో ఏర్పాటు చేశారు. మేళాను జిల్లా యువజన, క్రీడా అధికారి జె. ముత్తెన్న ప్రారంభించారు. వివిధ పాఠశాలల నుండి 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో మొదటి, రెండవ బహుమతి పొందిన వారికి శుక్రవారం జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు న్యూ అంబేద్కర్ భవన్, తిలక్ గార్డెన్ నిజామాబాద్‌లో ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర అధికారి శైలు బెల్లల్, జిల్లా సైన్స్ అధికారి గంగకిషన్, నిజామాబాద్, మాణిక్ భవన్ స్కూల్ హెడ్ మాస్టర్, మాణిక్ భవన్ స్కూల్ డైరెక్టర్, న్యాయ నిర్ణేతలు, బి.లక్ష్మణ్, ఎస్ఎ, నవీపేట్, ఆర్. సాయినాథ్, ఎస్ఎ, బినోల, డివైఎస్ఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు యువకుడు మృతి



నవతెలంగాణ-నందిపేట్

మండల కేంద్రంలో రాజ్ నగర్ దుబ్బ ప్రాంతానికి చెందిన పత్రిక కన్నయ్య(35) గురువారం మండల కేంద్రం ఊర చెరువులో శవమై కనిపించాడు. కన్నయ్య బుధవారం పొద్దున ఎనిమిది గంటల ప్రాంతంలో ఇంటి నుంచి పనికి వెళ్తానని బయలుదేరాడు. గురువారం ఊర చెరువులో మృతిచెందిన కన్నయ్యను గుర్తించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతుడు గణేష్ విగ్రహాలకు సంబంధించిన ఇనుప చువ్వల కొరకు చెరువులో వెతుకుతుండగా ప్రమాదవశాత్తు మరణించినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చామని ఎస్సై హరిబాబు తెలిపారు. వివరాల్లోకి వెళితే మృతుడు రాజ్ నగర్ దుబ్బ ప్రాంతానికి చెందినవాడు కాగా కన్నయ్యకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. కూలినాలి చేసుకొని కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఊర చెరువులో గణేష్ నిమజ్జనాలు ప్రతి ఏటా జరుగుతుంటాయి. నిమజ్జనం అనంతరం ఇనుప రాడ్ల కొరకు చెరువులో దిగుతుంటారు. ఇలా ప్రతి ఏటా ఒకరు మరణిస్తూనే ఉంటారు. ఆ ఇనుప చువ్వలకు ఆశపడి ఇలా నిండు ప్రాణాలను బలిగా పెడుతుంటారు. కన్నయ్య మృతితో కుటుంబం రోడ్డున పడింది.

క్రీడా దుస్తులు అందజేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులకు కమ్మర్ పల్లి టీచర్స్ అసోసియేషన్ సభ్యులు క్రీడ దుస్తులను అందజేశారు. ఈ మేరకు గురువారం మండల అంతర్ పాఠశాలల క్రీడల్లో పాల్గొంటున్న 25మంది కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థినిలకు క్రీడ దుస్తులను పంపిణీ చేశారు. క్రీడాదుస్తులను అందించినందుకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారిణి గంగమణి, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బషీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు గంగాధర్, ఉపాధ్యాయులు సల్లూరి కిషన్ గౌడ్, రవీందర్, రిటైర్డ్ ఉపాధ్యాయులు నాగభూషణం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐలమ్మ జయంతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

భూమి కోసం, భుక్తి కోసం పోరాటం చేసిన వీరనారి ఐలమ్మ అని పలువురు ఓనియాడారు. చాకలి ఐలమ్మ 129 జయంతి సందర్భంగా గురువారం ఇందల్ వాయి, డిచ్ పల్లి మండల కేంద్రంలతో పాటు ఆయా గ్రామాల్లో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి/మాక్లూర్

సఫాయి మిత్ర సురక్ష సివిర్'కార్యక్రమంలో భాగంగా ఇందల్ వాయి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రామస్థాయి పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలను గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ మాట్లాడుతూ.. చేతులకు గ్లౌజులు వేసుకోవాలని, మాస్క్ వేసుకొని చెత్త సేకరణలో పాల్గొనాలని తడి చెత్త పొడి చెత్త వేరు వేరు చేయాలని అవగాహన కల్పించారు. ఎవరైనా జ్వరంతో బాధపడుతున్నట్లయితే ఆరోగ్య సిబ్బందికి తెలియజేయాలని తెలిపారు. వారి వద్ద పారాసిటమోల్ మాత్రలు తీసుకొని రక్త పరీక్షలు నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇందల్వాయికి రావాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల రక్తపరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇందల్ వాయిలో డాక్టర్ వినీత్, డాక్టర్ మానస 96 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో స్రవంతి, కావ్య, సుచరిత, దీప్తి ,కీర్తన ఆరోగ్య సిబ్బంది ఆనంద్ స్టాఫ్ నర్సులు గంగమని ,ప్రకాష్ ఫార్మసిస్టు విజయలక్ష్మి పాల్గొన్నారు.

మాక్లూర్ :మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల గ్రామపంచాయతీ కార్మికులకు మండల అభివృద్ధి కార్యాలయం ఆద్వర్యంలో ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాలు సైబుద్దీన్ పంచాయతీ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు. కొందరికి జిల్లంకేంద్ర ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్, గ్రామపంచాయతీ కార్యదర్శి రాకేష్, ఇతర పంచాయతీ కార్యదర్శులు, కార్మికులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి : ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న పారిశుధ్య కార్మికులు

ఘనంగా ఈరవత్రి అనిల్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-బాల్కొండ/ముప్కాల్

తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బాల్కొండ పట్టణ కేంద్రంలో వి కన్వెన్షన్ లో నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదానం చేసిన యువకులకు కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, బాల్కొండ పట్టణ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, మైనారిటీ మండల అధ్యక్షుడు జావీద్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కిసాన్ నగర్ లోని గీతాశ్రమంలో వృద్దులకు పండ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కనికరం గంగాధర్ డిసిసి డెలిగేట్ తమ్మె కపిల్ కుమార్, మండల ఉపాధ్యక్షులు జక్క రాజలింగం, అరుట్ల రమేష్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ముప్కాల్:రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్, మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్ కుమార్ జన్మదినం సందర్భంగా గురువారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నిజామాబాద్ కు చెందిన రెడ్ క్రాస్ సొసైటీ వారు రక్తాన్ని సేకరించారు. వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యం రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బద్దం సాగర్ రెడ్డి, డీసీసీ డెలిగేట్ ఉపాధ్యక్షులు సుంకరి రాజ్ కుమార్ తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు రక్తదానం చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు..

మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్, మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాల్లో మునిగిపోయారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యం రెడ్డి, గడ్డం చిన్న గంగారెడ్డి, పోల ప్రవీణ్, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బద్దం సాగర్ రెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చందా జైడి రవి, లోక సుభాష్, ప్రశాంత్, ముస్కు శ్రీను, మయూర్, ఎట్టెం మహేష్ యాదవ్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

గిరిరాజ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బాలమణికి డాక్టరేట్ పట్టా ప్రదానం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ లో "స్థానిక గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి) కి చెందిన ఫిజికల్ డైరెక్టర్ బి.బాలమణి ఉస్మానియా విశ్వవిద్యాలయం లో ఆచార్య బి.సునీల్ కుమార్ పర్యవేక్షణ లో "ఎఫెక్ట్ ఆఫ్ సెలెక్టెడ్ ట్రెనింగ్ మెథడ్స్ ఆన్ మోటార్ ఫిట్నెస్ డెవలప్మెంట్ ఎమాంగ్ కాలేజ్ లెవెల్ వాలీబాల్ ప్లేయర్స్ ఇన్ నార్త్ తెలంగాణ రీజియన్ ఇన్ రిలేషన్ టు దైయిర్ పెర్ఫార్మెన్స్ అనే అంశం పై 2018 లో నమోదు చేసుకుని 2024 సెప్టెంబర్ 13 న డాక్టరేట్ పట్టాను అందుకున్నారు.



డాక్టరేట్ అందుకుంటున్న ఫిజికల్ డైరెక్టర్ బాలమణి

ఫిజికల్ డైరెక్టర్ గా 25 సంవత్సరాలుగా కొనసాగుతూనే ఎన్ సిసి అధికారిణిగా కెప్టెన్ ర్యాంక్ హొదాను పొందారు. ఎంతో మంది విద్యార్థిని, విద్యార్థులను క్రీడారంగంలోనూ, ఎన్‌సిసి విభాగంలోనూ జాతీయ స్థాయికి ,రాష్ట్రీయలో బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించేలా శిక్షణనిచ్చారు. డాక్టర్ బాలమణి విశిష్ట సేవలను గుర్తించిన తెలంగాణా హైయర్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ 2024 విద్యా సంవత్సరానికి ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్‌గా ఎంపికై రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. పి.రామ్మోహన్ రెడ్డి, అధ్యాపకులు, అభినందనలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం పొందిన ఉత్తమ ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని రైతు వేదికలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అధ్యక్షతన గురువారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కృష్ణాచారి, పవన్, ఎంకే.ప్రసాద్, సమిత, విజ్ఞరాజ్, భాస్కర్, సాయన్న, రాములు, గణేష్, అమల, గౌతమి, సంతోషి, శంకర్, సీ.ఆర్.పీ.గంగాప్రసాద్, ఐ.ఈ.ఆర్.పీ మధుశేఖర్‌ను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్గట్ల, కమ్మర్ పల్లి మండలాల ఎంఈఓలు ఆనంద్ రావ్, ఆంధ్రయ్య, ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేస్తూ.. సర్వేపల్లి రాధాకృష్ణన్ చూపిన మార్గంలో నడవాలని అన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణప్రసాద్, రాజశేఖర్, యూటీఎఫ్ అధ్యక్షులు సత్యానంద్, ప్రధానోపాధ్యాయులు దశెంధర్, శ్రీనివాస్, అబ్దుల్ జావీద్, కస్తూర్బా ఎస్.ఓ.సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొరంతో కల్వర్టు గుంతలు పూడ్చివేత



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రం నుండి ఉప్లూర్ వెళ్లే దారిలో ఉన్న కల్వర్టు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైన విషయం తెలిసిందే. పెద్ద ఎత్తున కల్వర్టు వద్ద బీటి రోడ్డు సగం వరకు కోతకు గురై గత కొంతకాలంగా ప్రమాదకరంగా మారింది. కొద్ది రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి అందులో పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. రాత్రివేళ ఈ దారి గుంట ప్రయాణించే వాహనదారులు అజాగ్రత్తగా వెళితే కల్వర్టు వద్ద ఏర్పడ్డ గుంతలో పడి ప్రమాదాలకు గురయ్యే ఆస్కారం ఉంది. భారీ వర్షాల మూలంగా కోతకు గురై ప్రమాదకరంగా మారిన కల్వర్టు విషయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ దృష్టికి తీసుకుపోయారు.వెంటనే స్పందించిన ఆయన ఆర్‌అండ్‌బి ఏడికి సమస్యను వివరించి మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. గురువారం ఆర్ అండ్ బి అధికారులు కల్వర్టు వద్ద ఏర్పడ్డ పెద్ద గుంతల్లో మొరం నింపి బ్లేడు ట్రాక్టర్ తో చదును చేయించారు. కోతకు గురైన కల్వర్టు వద్ద ప్రమాదాలు జరగకుండా ఆర్ అండ్ బి అధికారులతో మాట్లాడి తాత్కాలికంగా గుంతలను పూడిపించి, రోడ్డును బాగు చేయించిన ముత్యాల సునీల్ కుమార్ కు ఉప్లూర్ గ్రామ ప్రజల తరపున కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అక్రిడిటేషన్ కార్డ్ 3 నెలలు పొడిగింపు

- కామారెడ్డి డిపిఆర్వో భీంకుమార్

నవతెలంగాణ-కామారెడ్డి

అక్రిడిటేషన్ కార్డు సమయాన్ని మరో మూడు నెలలు పొడిగిస్తున్నట్టు కామారెడ్డి డిపిఆర్వో భీంకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 30తో గత మూడు నెలల క్రితం ప్రకటించిన సమయం ముగుస్తుండడంతో కొత్త అక్రిడిటేషన్ కార్డుల జారీకి మరో మూడు నెలలు పొడిగించినట్టు భీంకుమార్ పేర్కొన్నారు.

30న నాగారంలో ఆర్చరీ ఎంపికలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జి ఎఫ్) ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 బాలురు, బాలికల ఆర్చరీ ఎంపికలు ఈనెల 30 న నగారం స్టేడియంలో నిర్వహించనున్నట్టు ఎస్‌జిఎఫ్ జిల్లా సెక్రెటరీ జి నాగమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14 లో బాలురు, బాలికలు 01-01-2011 లేదా ఆ తరువాత జన్మించిన విద్యార్థులు, 6వ తరగతి, ఆ పై తరగతుల వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. అండర్ 17 లో బాలురు, బాలికలు 01-01-2008 లేదా ఆ తరువాత జన్మించిన విద్యార్థులు, 6వ తరగతి, ఆ పై తరగతుల వారు మాత్రమే విద్యార్థులు అర్హులని తెలిపారు. ఒరిజినల్ బోనఫైడ్ సర్టిఫికెట్ తీసుకురావాలి అని అన్నారు. మరిన్ని వివరాలకు పీరియా ఈ ఫోన్ నెంబర్ 7036915136 కు సంప్రదించాలని పేర్కొన్నారు.

మండల విద్యాశాఖ అధికారిగా జక్కుల రవి కుమార్



నవతెలంగాణ-ముప్కాల్

మండల 'ఫుల్ అడిషనల్ ఇంఛార్జి' మండల విద్యాశాఖ అధికారిగా జక్కుల రవి కుమార్ గురువారం రోజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా ఉపాధ్యాయులు జక్కుల రవి కుమార్ కు అభినందనలు తెలియజేశారు. ప్రస్తుతం ఆయన రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. కార్యక్రమంలో పీఆర్టియు మండల శాఖ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, ముప్కాల్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం. గంగారాం, ప్రధాన కార్యదర్శి కొంద్రు నవీన్ కుమార్, ఉపాధ్యాయ బృందం గుండోజి నరేందర్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు..

ఫార్మాసిస్టులది ముఖ్యమైన పాత్ర

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణంలో ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం బుధవారం రాత్రి ఫార్మసిస్టులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమ రాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతిమ రాజ్ మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య విభాగంలో ఫార్మసిస్టులది ఒక ముఖ్యమైన పాత్రని వారి సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ బాల్‌రాజ్, డిప్యూటీ సూపరింటెండెంట్, రఘునాథ్, ఫార్మసీ సూపర్‌వైజర్, ఇతర సిబ్బంది, ఆసుపత్రి వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం

- ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు



కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-గాంధారి

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేరుస్తామని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. గురువారం మండలంలోని పెట్‌సంగెం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం గాంధారి మండల కేంద్రంలోని రైతు వేదిక కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతీ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని, ఇప్పటికే కొన్ని హామీలు నెరవేర్చిందని తెలిపారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా వారి కష్టాలు తీర్చి వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సతీష్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ సాయికుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోహన్ నాయక్, మాజీ జడ్పిటిసి శంకర్ నాయక్, గాంధారి మాజీ సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, గాంధారి మాజీ ఎంపీటీసీలు తూర్పు రాజులు, కామెల్లి బాలరాజ్, పరమేష్, ఆకుల లక్ష్మణ్, గాండ్ల లక్ష్మణ్, సర్దార్ నాయక్, సంఘని బాబా, ప్రవీణ్ గౌడ్, గడ శంకర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐసెట్ నూతన విద్యార్థులకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలంగాణ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆర్ట్స్, సైన్స్ కళాశాల వద్ద ఐ సెట్ ద్వార నూతన ప్రవేశం ఎంబిఎ మరియు ఎంసిఎ విద్యార్థులకు హెల్ప్ డెస్క్ నిర్వహించారు. నూతనంగా తెలంగాణ యూనివర్సిటీలో ప్రవేశం పొందే ఎంబిఎ, ఎంసిఎ విద్యార్థులు ఎబివిపి తెలంగాణ యూనివర్సిటీ శాఖను సంప్రదించాలని తెలిపారు.కార్యక్రమంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు బి.శివ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజు, యూనివర్సిటీ సెక్రటరీ అమృత్ చారి, నాయకులు సాయినాథ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలు నిర్వహించాలి

- ఎంపీడీవో ప్రభాకర్ చారి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో అక్టోబర్ 2 నుంచి గ్రామసభలు నిర్వహించాలని ఎంపీడీవో ప్రభాకర్ చారి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సబ్కా సాత్ సబ్కా వికాస్ కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో గ్రామ సభలు నిర్వహించాలని, పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. గ్రామాల్లో పన్నుల వసూలు చేయాలని ఆదేశించారు. ఈనెల 28న ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో ఓటర్ లిస్టును ఏర్పాటు చేయాలని ఆయన పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో

రసాభాసగా మహాజన సభ సమావేశం

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలోని సహకార పరపతి సంఘం 89వ మహాజన సభను గురువారం నిర్వహించగా.. సమావేశం రసాభాసగా కొనసాగింది. సంఘం ఆడిట్ చేయని లెక్కలను చదివి వినిపించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు రాకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం ఉన్నట్లు 15 రోజుల ముందుగా సమాచారాన్ని తెలియజేయాల్సి ఉండగా.. సభ్యులకు సరైనరీతిలో తెలుపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిసిఓ శ్రీనివాస్ సమావేశానికి హాజరై సంఘంలో అవకతవకలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో పాలకవర్గం రద్దు చేయాలని, సెక్రటరీ, బాధ్యులైన వారిపై చర్య తీసుకోవాలని, ఇంటర్నల్ (కాంకరెంటు) ఆడిట్ చేయాలని సభ్యులు కోరారు.



సభలో పాల్గొన్న పలువురు

మహిళశక్తితో ఆర్థికంగా ఎదగాలి

- ప్రభుత్వ సలహాదారుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి
- మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

మహిళలు మహిళశక్తితో ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వ సలహాదారుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం బాన్సువాడ మున్సిపాలిటీ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను పోచారం ప్రారంభించారు. అలాగే అధికారులతో రివ్యూ మీటింగ్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాన్సువాడ నియోజకవర్గం రాష్ట్రంలో ఆదర్శంగా నిలుస్తుందని అందుకు మహిళలు కూడా ఆర్థిక అభివృద్ధిలో ఆదర్శంగా నిలువాలని సూచించారు. ప్రతీ మహిళ ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఒక వ్యాపార వేత్త కావాలని తెలిపారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు. అన్ని రంగాల్లో రాణించి ప్రగతి పథంలో దూసుకుపోవాలన్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న ఉత్పత్తులను తయారు చేసి ఆదాయం గడించాలన్నారు. మహిళా సభ్యులందరూ రుణాలు పొందేలా అధికారులు, మహిళా సంఘం సభ్యులు కృషి చేయాలని సూచించారు. రుణాల రికవరీ గతంలో కన్నా పెరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో సంస్థ చైర్మన్ కాసుల బాలరాజ్, మాజీ ఎమ్మెల్యే, మున్సిపాలిటీ చైర్మన్ గంగాధర్, కమిషనర్ శ్రీహరిరాజు, మేనేజర్ మల్లికార్జున్ రెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, డ్వాక్రా అధికారి శ్రీధర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు, సీనియర్ నాయకులు కలిక్, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.



శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సమాచార హక్కు చట్టంపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

పట్టణ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై గురువారం అవగాహనా సదస్సును గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 పౌరులకు వజ్రాయుధం లాంటి దని, విద్యార్థుకు విద్యా హక్కు చట్టం, బాల కార్మిక హక్కు చట్టం ఇతర చట్టాల గురించి తెలిపారు. సమాచార హక్కు చట్టం దరఖాస్తు విధానం గురించి క్షుప్తంగా వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ సలీం, ఎస్సై నవీన్ చంద్ర, సమాచార హక్కు చట్టం రాష్ట్ర కార్యదర్శి రాజు, ఆర్టిఐ డివిజనల్ అధ్యక్షులు లింగమయ్య, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా దర్గా ఉత్సవాలు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో గల పీరానే పీర్ గౌస్ ఆజం దస్తగీర్ హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జిలాని దర్గా ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. దర్గా పీఠాధిపతి సూఫీ ష మహమ్మద్ షరీఫోద్దీన్ శతారి ఉల్కాది ఆధ్వర్యంలో దర్గా ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ జెడ్పిటిసి మనోహర్ రెడ్డి హాజరై పీఠాధిపతిని సన్మానించారు. కార్యక్రమంలో వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ విలేజ్ డెవలప్మెంట్ ఆఫీసర్ కామినేని లక్ష్మారెడ్డి ఇటీవల మరణించిన విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించి ఓదార్చారు. మాజీ ఎమ్మెల్యే వెంట ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.

సఫాయి మిత్ర సురక్ష హెల్త్ క్యాంపు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి, సదాశివనగర్ గ్రామ పంచాయతీ సిబ్బందికి గురువారం ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆస్మా అఫ్షిన్, ఎంపిడిఓ సంతోష్ కుమార్, ఎంపిఓ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో కంటి వైద్య పరీక్షలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని భాగిర్థిపల్లి, ఇసన్నపల్లి గ్రామాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కంటి వైద్య నిపుణులు రవీందర్ పాటిల్ వైద్య పరీక్షలు నిర్వహించి కంటి చూపు సమస్యతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలతో పాటు భాగిర్థిపల్లి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమెన్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దోమకొండ, భిక్కనూరు మండల కమ్యూనిటీ కోఆర్డినేటర్ శ్రీవిద్య విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ మాట్లాడుతూ బాల బాలికలకు విడివిడిగా కౌమార శిక్షణలో భాగంగా కౌమార దశ గల బాల బాలికల లైంగిక వ్యాధులు హెచ్ఐవి ఎయిడ్స్ గురించి వివరించారు. విద్యార్థులు బాల్యంలోనే జాగ్రత్తలు పాటించి ప్రతి విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనాథ్, దుర్గారెడ్డి, రేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

ఆపరేషన్ కోసం ఎల్ఓసి అందజేత

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామానికి చెందిన నిరాడి గంగాధర్ అత్యవసరంగా ఆపరేషన్ చేసుకోవడానికి డబ్బులు లేకపోవడంతో బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి వెంటనే స్పందించి ఆయనకు రూ.2లక్షల 50 వేల చెక్కును అందజేశారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబిన్ ఖాన్ స్పష్టం చేశారు. గురువారం సాటాపూర్ చౌరస్తాలో గంగాధర్‌కు ఎల్ఓసిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు సీఎం సహాయనిధి లాంటి పథకాలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. సాటాపూర్, నీలా, బోర్గం గ్రామాలలో లక్ష పదివేల రూపాయలు విలువగల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు జి.సాయిరెడ్డి, మాజీ జిల్లా కార్యదర్శి జావీద్ ఉద్దీన్, మాజీ వైస్ ఎంపీపీ గంగా కృష్ణ, బాధితుడు నేరడి గంగాధర్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

మెట్ల బావిని సందర్శించిన ప్రత్యేక అధికారి

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో గల నాగన్నగారి మెట్ల బావిని డిఆర్‌డిఏ మండల ప్రత్యేక అధికారి సురేందర్ గురువారం సందర్శించారు. చారిత్రక కట్టడమైన మెట్ల బావి ఇటీవల రైన్‌పాల్ ఇన్ఫోసిస్ సంస్థ వారు ప్రారంభించారు. పర్యాటకుల కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు మెట్ల బావిని తెరిచి ఉంచాలని, నిర్వాహణ కోసం ప్రత్యేకంగా ఒకరిని నియమించాలన్నారు. శుక్రవారం రాష్ట్ర టూరిజం శాఖ అధికారులు మెట్ల బావిని సందర్శించనున్నారన్నారు. అందుకుగాను ఏర్పాట్లు చేయాలని అధికారులు ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో నరేష్, ఏపిఎం శ్రీనివాస్, ఎంపీఓ మల హరి, కార్యదర్శి శ్రవణ్ కుమార్, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఉద్యోగ నియామకపత్రాలు అందజేయాలి

- తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-పిట్లం

వీఆర్ఏ వారసులకు ఉద్యోగ నియామకాలు పత్రాలు అందజేయాలని డిమాండ్ చేస్తూ 61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏ వారసులు స్థానిక తహసిల్దార్ వేణుగోపాల్‌కు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 20,555 మంది వీఆర్ఏలను రెండు విభాగాలు చేసి 61 సంవత్సరాలు లోపు వీఆర్ఏలు 16,758 కాగా 61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏలు 3,797 లుగా విభజించి 2023 జులైన గత ప్రభుత్వం జీవో నెంబర్ 81, 85ను విడుదల చేసిందని తెలిపారు.ఈ జీవోల ప్రకారం మొదటి విభాగం 16,758 మందిని రెగ్యులర్ చేస్తూ సీసీఎల్ఏ సర్క్యులర్ ప్రవేశపెట్టిందని, మిగిలిన 3797 మంది వీఆర్ఏ వారసులకు 81 జీవో ప్రకారం ఉద్యోగం నియామకపత్రాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఉద్యోగ నియామక పత్రాలపై 2023 నవంబర్ వరకు స్టే విధించడంతో మూడు నెలలపాటు ఆర్డర్లు ఇవ్వలేదని అన్నారు. తదనంతరం కోర్టు స్టే ఎత్తివేసిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు రాగా ఎన్నికలలో వీఆర్ఏ వారసులు విధులు నిర్వహించామన్నారు. ప్రస్తుత తరుణంలో తహసీల్దార్ కార్యాలయాలలో ప్రతిరోజు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, తహసీల్దార్ కార్యాలయ విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్నదమ్ముల, పాలివారల ఉద్యోగం గురించి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌పైన సంతకాలు పెట్టించటం గురించి అనేక ఒప్పందాలు ఉన్నామని తెలిపారు. కొందరు వారసత్వ భూమి ఇవ్వటం జరిగిందని తెలిపారు. వీఆర్ఏ వారసులు వారసత్వ భూమి, నగదు డబ్బులను వడ్డీ రూపంలో చెల్లించి తీవ్ర మానసిక ఒత్తిడితో ఆర్థిక ఇబ్బందులతో వడ్డీలు కట్టలేక మనస్థాపంతో రాష్ట్రవ్యాప్తంగా 45 మంది వీఆర్ఏ వారసులు మృతిచెందినట్లు తెలిపారు. కోర్టు స్టే ఎత్తివేసి నేటికీ ఏడాది పూర్తవుతున్నా.. ఉద్యోగ ఆర్డర్లు రాకపోవడంతో మా మనోవేదనను 29 సెప్టెంబర్ 2024న రెవిన్యూ మినిస్టర్ మీటింగ్‌లో మా సమస్యలను ఆయన దృష్టికి చేరవేసి తగు న్యాయం చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో చిర్వేరి శ్రీకాంత్, బాలయ్య, మల్లేష్, రాజు, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

ప్రమాదవశాత్తు లారీ కింద పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన లాల్సర్ గణేష్ (23) మేస్త్రి కూలి అనే వ్యక్తి ప్రమాదవశాత్తు లారీ కింద పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం సాయంత్రం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై మోహన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న లాల్సర్ గణేష్ వర్షం పడుతుండటంతో ప్రమాదవశాత్తు గుంతలో పడి ఎదురుగా వస్తున్న లారీ కింద పడి మృతి చెందాడు. వెంటనే ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని లారీని అదుపులో తీసుకొని పోలీస్ స్టేషను కు తరలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో తరచూ ప్రమాదాలు..

మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వర్షం పడటంతో అందులో నీరు చేరి గుంతల లోతు తెలియక తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు పూడ్చే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మృతిచెందిన గణేష్

పంటలు పరిశీలించిన శాస్త్రవేత్తలు



మద్నూర్ : పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నవతెలంగాణ-మద్నూర్/నిజాంసాగర్

డోంగ్లి, మద్నూర్ మండలాల్లోని పలు గ్రామాలలో వరి, పత్తి పంటలను శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సస్యరక్షణ శాస్త్రవేత్త టి.విజయ్ కుమార్ మాట్లాడుతూ.. వరి పొలాలలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు, కంకి నల్లి అలాగే గింజ మచ్చ తెగులు ఆశించిందని గమనించారు. బ్యాక్టీరియా ఎండు తెగులు నివారణకు కంకులు నిండే దశలో ఉందని, కాబట్టి కాపర్ సంబంధిత మందులు పిచికారి చేయకుండా, ప్లాంటమైసిన్ అనే మందు మాత్రమే 0.4 గ్రా లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాల్సిందిగా రైతులకు తెలిపారు. అలాగే కంకి నల్లి, గింజ మచ్చ తెగులు నివారణకై స్పైరోమెసిఫిన్ ఏ1 మీ.లి, ప్రొపికొనజోల్ ఏ1 మీ.లి లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. తరువాత పత్తి పంటలో క్షేత్ర స్థాయి సందర్శనలు నిర్వహించి పత్తి పంట ప్రస్తుతం కాయ ఎదుగుదల దశలో ఉందని ఈ దశలో గులాబీ రంగు పురుగు ఆశించడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. గులాబి రంగు పురుగు నివారణకై ఎకరానికి 10 చొప్పున లింగాకర్షణ బుట్టలు ముందస్తుగా అమర్చుకున్నట్లయితే దిగుబడి, నష్టం జరగకుండా ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో డా.రాజ్కుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్, పి.విజయ్ కుమార్, సౌమ్య, బసవరాజ్, సంపత్ విశాల్, రైతులు గజానంద్ దేశాయ్, శుభాష్, గంగాధర్, రాజ్‌కుమార్, భీమ్‌రావు, తదతరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ : మహమ్మద్‌నగర్ మండలంలోని సింగీతం, తెల్గపూర్ గ్రామలలో వరి పొలాలను మండల వ్యవసాయ విస్తరణ అధికారి రేణుక గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వరి పంటలో కాండం తొలుచు పురుగు, అగ్గితెగులు, పొట్ట కుళ్లు తెగులు, బ్యాక్టీరియా, ఎండాకు తెగుళ్ళ ఉధృతంగా వ్యాప్తి చెందడం గమనించామని ఆమె తెలిపారు. అగ్గితెగులు నివారణకు ఐసోప్రొథైయోలిన్ 350 మి.లీ. ఎకరానికి లేదా కాసుగమైసిన్ 500 మి.లీ. ఏకరానికి స్ప్రే చేయవలసిందిగా ఆమె సూచించారు. కాండం తొలుచు పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ ఎకరానికి 400 గ్రాములు లేదా క్లొరాంట్రానిలిప్రోల్ ఎకరానికి 60మి.లీ. పిచికారి చేయాలని సూచించారు. పొట్ట కుళ్లు తెగులు నివారణకు ప్రొపికొనజోల్ ఎకరానికి 200 గ్రాములు పిచికారి చేయాలని, బ్యాక్టీరియా ఎండాకు తెగులు నివారణకు స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ మందును ఎకరానికి 50 గ్రాములు పిచికారి చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతితో పెట్టుబడి తగ్గుతుంది

- ఏఈఓ రాకేష్

నవతెలంగాణ-రామారెడ్డి

రైతులు వెదజల్లే పద్ధతిలో వరి సాగు ద్వారా పెట్టుబడి రూ.6 నుంచి 7 వేల వరకు తగ్గించుకొని, లాభాలు పొందవచ్చని రామారెడ్డి ఏఈఓ రాకేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కొట్టే వెంకటి వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. వర్షాలకు సాగులో పాటించవలసిన పద్ధతులను రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

వరి తెగుళ్ల నివారణకు చర్యలు

నవతెలంగాణ-రెంజల్

ఆగస్ట్, సెప్టెంబర్ నెలలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వరి పైరుపై ఆకు కొనలు ఎర్రబడి ఎండిపోవడం జరుగుతుందని వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. సాధారణంగా వరి ఆకులలో పత్ర గ్రంధాల ద్వారా రెప్రిటేషన్ ద్వారా నీటిని బయటకు పంపుతుందని, ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడం వలన రేప్రిడేషన్ ప్రక్రియ ద్వారా పంపలేకపోవడంతో ఇలాంటి చీడపీడలు సోకుతాయన్నారు. ముఖ్యంగా బ్యాక్టీరియా, ఎండాకు తెగులు సోకిన రైతులు స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు సంప్రదించి తగిన మందులను పిచికారీ చేసినట్లయితే చీడపీడలను నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. అధికారుల సూచనల మేరకు స్ప్రే చేసినట్లయితే పంటను రక్షించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.


పిచ్చి మొక్కల తొలగింపు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలో 11వ వార్డులో మురికి కాలువకు ఇరువైపుల ఉన్న పిచ్చిమొక్కలను గురువారం తొలగించారని ఎంపీఓ మలహరి తెలిపారు. దాసరి వాడ పీర్ల మసీదు వెనుక రోడ్డు, మురికి కాలువల ఇరువైపులా పిచ్చి మొక్కలు పేరుకుపోయి వాహనదారులకు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడంతో గ్రామపంచాయతీ సిబ్బంది కూలీల చేత పిచ్చి మొక్కలు తొలగించారు. మురికి కాలువల్లో చెత్త చెదారం వేయకుండా పరిసరాల పరిశుభ్రతను పాటించాలని కాలనీవాసులకు సూచించారు. ఆయన వెంట కార్యదర్శి శ్రావణ్ కుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది, ఉన్నారు.

శనగ విత్తనాలు పంపిణీ

నవతెలంగాణ-గాంధారి



మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శనగ విత్తనాలను సొసైటీ చైర్మన్ పెద్దబూరి సాయికుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనగ విత్తనాలు అవసరమున్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 25 కిలోల బస్తా ధర రూ.2250 ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఉదల్ సింగ్, డైరెక్టర్లు లక్ష్మణ్, తాడ్వాయి సంతోష్ కుమార్, దొళ్ళ సాయిలు, సొసైటీ సీఈఓ గాండ్ల సాయిలు రైతులు పాల్గొన్నారు.

నేడు మద్నూర్ సింగిల్ విండో 55వ మహాజనసభ


- కార్యదర్శి జె.బాబురావు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని వ్యవసాయ ప్రాథమిక పరపతి సంఘం సింగిల్ విండో 55వ మహాజనసభ ఈనెల 27న శుక్రవారం ఉదయం 10:30 గంటలకు సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్ అధ్యక్షతన కార్యాలయ భవనంలో నిర్వహించనున్నట్టు సంఘం కార్యదర్శి జే బాబురావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాజనసభకు సంఘం కార్యవర్గ సభ్యులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కార్యదర్శి కోరారు.

ఎడపల్లి ఎంఈవోగా సాయిలు

నవతెలంగాణ-ఎడపల్లి



మండల విద్యాశాఖ అధికారిగా ఎడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలును నియమిస్తూ జిల్లా స్థాయి విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎడపల్లి మండల విద్యాశాఖ అధికారిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు.

నాగిరెడ్డిపేట్ ఎంఈఓగా భాస్కర్‌రెడ్డి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్



మండల విద్యాధికారిగా భాస్కర్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. మండలంలోని బొల్లారం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు ప్రమోషన్ ఇవ్వడంతో నాగిరెడ్డిపేట్ ఎంఈఓగా భాస్కర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు.

గుండెపోటుతో మాజీ ఎంపీపీ మృతి

నవతెలంగాణ-బిచ్కుంద



గుండెపోటుతో మాజీ ఎంపీపీ అశోక్ పటేల్ మృతి చెందారు. గురువారం ఉదయం మాజీ ఎంపీపీకి గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన బాన్సువాడలోని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించడంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అశోక్ పటేల్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే తన సన్నిహిత రాజకీయ మిత్రుని కోల్పోయానని దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ శోకసముద్రంలో మునిగిపోయారు. స్వగ్రామం రాజుల్లా గ్రామంలో గురువారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించగా జుక్కల్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, ఆయా పార్టీలకు చెందిన నాయకులు, ప్రజలు, పాల్గొన్నారు.

మండల విద్యాధికారికి సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్

నూతనంగా మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన రాజ గంగారెడ్డిని మండల ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యం, ప్రభుత్వ పాఠశాలలోని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

మందులు పంపిణీ

నవతెలంగాణ-గాంధారి

పౌష్టికార లోపంతో బాధపడుతున్న పిల్లలను ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు, చికిత్స నిర్వహించి మందులు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

పుల్కల్లో మహాజన సభ

నవతెలంగాణ-బిచ్కుంద

మండలంలోని పుల్కల్ గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అధ్యక్షులు పట్లోళ్ల రామకృష్ణారెడ్డి అధ్యక్షతన మహాజన సభ గురువారం నిర్వహించారు. కార్యదర్శి సాయిప్రకాష్ జమ ఖర్చులు తదితర విషయాలను సభ్యుల సమక్షంలో చదివి వినిపించారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ కొందరు రైతులకు కాలేదని రైతుల వివరాలు ప్రభుత్వానికి పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని, రైతులు సభ దృష్టికి తీసుకొచ్చారు. విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, రైతులు, సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీలో వైద్య శిబిరం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఉప్పల్వాయి, గిద్ద గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్య శిబిరాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు సురేష్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అంగన్‌వాడీ కిశోర బాలురకు, టీచర్లకు, సిబ్బందికి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది జార్జ్, చంద్రకళ, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏఈఓను సన్మానించిన ప్యాక్స్ చైర్మన్

నవతెలంగాణ-వర్ని

(చందూర్) మండల వ్యవసాయ అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బి.కృష్ణరెడ్డిని పిఏసిఎస్ చైర్మన్ అశోక్ యాదవ్ గురువారం శాలువాతో కప్పి సన్మానించారు. మండల స్థాయి రైతుల సమస్యలపై ఆయనకు వివరించారు. కార్యక్రమంలో సిఈఓ భూమయ్య, కొత్తల అశోక్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, ఎర్ర పోసాని సాయిలు, ప్యారం గంగాధర్, సొసైటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబిన్ ఖాన్ ఆధ్వర్యంలో సిఎం సహాయ నిధి చెక్కులను గురువారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన శివ గణేష్, రాజవ్వ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, వారి చికిత్స నిమిత్తం బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి సీఎం సహాయ నిధి నుంచి చెక్కులను అందజేశారని ఆయన పేర్కొన్నారు. శివ గణేష్‌కు రూ.20వేలు, రాజవ్వకు రూ.9500 అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జి.సాయిరెడ్డి, జావిద్ ఉద్దీన్, గంగా కృష్ణ, బొడిగా రవి, భూమన్న, చీరడి రవి, భూమ రెడ్డి, కార్తీక్ యాదవ్, గొజ్జ రమేష్, గంగాధర్, సిద్ధ సాయిలు, గైని కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

30న ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో స్కేటింగ్ ఎంపికలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో స్కేటింగ్ ఎంపికలు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జి ఎఫ్) నిజామాబాద్ ఆధ్వర్యంలో అండర్ 11, 14, 17 బాలురు, బాలికల స్కేటింగ్ ఎంపికలు ఈనెల 30 న డిఎస్ఏ స్విమ్మింగ్ పూల్, నిజామాబాద్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అండర్ 11 లో బాలురు, బాలికలు 01-01-2014 లేదా ఆ తరువాత జన్మించిన విద్యార్థులు 3 నుండి 5వ తరగతి విద్యార్థులు, అండర్ 14 లో బాలురు, బాలికలు 01-01-2011 లేదా ఆ తరువాత జన్మించిన విద్యార్థులు 6వ తరగతి ఆ పై తరగతుల విద్యార్థులు, అండర్ 17 లో బాలురు, బాలికలు 01-01-2008 లేదా ఆ తరువాత జన్మించిన విద్యార్థులు 6వ తరగతి ఆపై తరగతుల విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు తమ బోనఫైడ్ సర్టిఫికెట్ తీసుకురావాలని మరింత సమాచారం కోసం రామ్‌చందర్ 8333947957 నెంబర్‌కు తెలుసుకోవాలని తెలిపారు.

4న జిల్లాకు పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ రాక

29న కాంగ్రెస్ భవన్‌లో విస్తృతస్థాయి సమావేశం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నూతనంగా టిపిసిసి అధ్యక్షులుగా నియమితులైన తర్వాత మహేష్ కుమార్‌గౌడ్ అక్టోబర్ 4న మొదటిసారి వస్తున్నారని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి తెలిపారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ నెల 29న నిజామాబాద్ జిల్లాకు వస్తున్న సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలకడానికి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, నియోజకవర్గ కోఆర్డినేటర్లు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, పిసిసి డెలిగేట్లు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొనాలని తెలిపారు. సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

టీపీసీసీని కలిసిన జిల్లా నాయకులు



టీపీసీసీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ పిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను గురువారం హైదరాబాదులోనే ఎమ్మెల్యే క్వార్టర్‌లో నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఆదే ప్రవీణ్ కుమార్ (జిల్లా కన్వీనర్ - తెలంగాణా బీసీ మహాసభ, నిజామాబాద్ జిల్లా, జిల్లా అధ్యక్షులు - సమాచారా హక్కు చట్టం పరిరక్షణ కమిటీ, నిజామాబాద్ జిల్లా), (కో. కన్వీనర్ - సర్వసమాజ్ కమిటీ, నిజామాబాద్, శాశ్వత డైరెక్టర్ రాజారాజేశ్వరి మున్నూరుకాపు నిత్యాన్నదానం సత్రం, వేములవాడ, మాజీ అధ్యక్షులు), విజయ్ కిసాన్ మున్నూరు కాపు సంఘం, గాజుల్ పేట్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, నిజామాబాద్), పైసా ఎల్లయ్య (కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ మండలం ప్రెసిడెంట్), కోనేరు సాయి కుమార్ (ఎరుకల గిరిజనుల హక్కుల ఐక్య పోరాట సాధన సమితి (కుర్రు) రాష్ట్ర అధ్యక్షులు) శాలువా కప్పి బొకే ఇచ్చి ఘనంగా సన్మానించారు. బీసీ కుటుంబ బంధువుకు ఈ అత్యున్నత పదవి రావడం చాలా ఆనందంగా ఉందని వారు తెలిపారు.

మొక్కలునాటి.. పిల్లలకు కానుకగా ఇవ్వాలి

- సీపీ కల్మేశ్వర్
- పోలీస్ కమిషనరేట్‌లో హరితహారం



మొక్కను నాటుతున్న సీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలో హరిత హారం కార్యక్రమం నిర్వహించిన పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ ఐపియస్ పోలీస్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ భవనం సమీపంలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ వంతుగా మొక్కలు నాటి మన పిల్లలకు కానుకగా ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బి. కోటేశ్వర రావు, అదనపు పోలీస్ కమిషనర్ (ఎఆర్) శంకర్ నాయక్, పోలీస్ కార్యాలయం సూపరింటెండెంట్లు, సిబ్బంది, రిజర్వు ఇన్‌స్పెక్టర్స్, ఆర్ఎస్ఐలు, ఐటి కోర్ సిబ్బంది, సిసిఆర్‌బి సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ సేవ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం మండలంలోని చేపూరు గ్రామం లో నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ చాలా చక్కటి సేవా కార్యక్రమాలు చేపట్టారు. చేపూర్ గ్రామంలోగల ప్రభుత్వ ప్రాథమిక, జడ్పిహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు, గ్రామస్తులకు క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్, గ్రామ పరిసరాల పచ్చదనం పరిశుభ్రత గురించి వివరించారు. ప్రోగ్రాంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాఠశాల విద్యార్థులతో కలిసి స్వచ్ఛ భారత్ చేపట్టారు. మొక్కలు నాటడం, బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మికుల నిర్మూలన, యాంటీ డ్రగ్స్ గురించి సందేశాన్ని విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమానికి గ్రామ పంచాయతీ సెక్రటరీ హరీష్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మహేష్, ఎన్ఎస్ఎస్ కమిటీ సభ్యుడు జి.శృతిన్ చేపూర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు, క్యాప్‌ల వితరణ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులు, క్యాప్‌లను వితరణ చేశారు. గురువారం నుంచి ప్రారంభమైన క్రీడల్లో పాల్గొంటున్న విద్యార్థులకు పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో క్రీడా దుస్తులు, క్యాప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు సోమ దశరథ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మండల క్రీడాల్లో ఉప్లూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమంగా రాణించి విజయాలు పొంది రావాలని ఆశీర్వదించారు. విద్యార్థులకు క్రీడా దుస్తులు, క్యాప్‌లను వితరణ చేసిన గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులకు ప్రధానోపాధ్యాయులు కే.రాజన్న ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిరిమల్ల దేవన్న, సల్లూరి కిషన్‌గౌడ్, గుండోజి రవీందర్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు కొమ్ముల రవీందర్, చింతకుంట శ్రీనివాస్, సాంబార్ అశోక్, సుంకరి విజయ్ కుమార్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలి

- రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి
- భవిష్యత్తు తీర్చిదిద్దుకోవడానికి క్రీడలు ఎంతో అవసరం
- ఘనంగా మండల అంతర్ పాఠశాలల క్రీడలు ప్రారంభం



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుల్లోనే కాకుండా క్రీడల్లో కూడా ప్రోత్సహించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జిఎఫ్) మండల అంతర పాఠశాలల క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి, క్రీడల పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థుల మార్చ్ ఫాస్ట్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ..అంతర పాఠశాల క్రీడా పోటీలను రాష్ట్ర స్థాయి పోటీల్లాగా ప్రారంభించుకోవడం అభినందనీయమన్నారు. మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యకరమైన జీవితానికి, ఉన్నతంగా మన భవిష్యత్తు తీర్చిదిద్దుకోవడానికి క్రీడలు ఎంతో అవసరం అన్నారు. క్రీడలు అనేవి కేవలం ఫిట్ నెస్ కోసమే కాదు..జీవితంలో మనకు ఎదురు దెబ్బలు తగిలినపుడు వాటిని తట్టుకొని నిబ్బరంగా, మనో ధైర్యంగా ఉండటానికి ఉపయోగపడతాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజం.. అన్నింటిని సమానంగా తీసుకోవాలని, అప్పుడే స్పోర్టింగ్ స్పిరిట్ విద్యార్థుల్లో అలవడుతుందన్నారు. రాజ్ కుమార్, మల్లేష్ లాంటి క్రీడా ప్రేమికులు ఉండటం వల్లనే ఇంకా క్రీడలు గొప్పగా నిర్వహిస్తున్నారని అన్నారు. మా వియ్యంకుడు వ్యాపారవేత్త దయానంద రెడ్డి దాతృత్వానికి అవధులు లేవని, ఆయన జిల్లా వ్యాప్తంగా, బాల్కొండ నియోజకవర్గంలో పాఠశాలలకు అవసరమైన డెస్క్ బెంచ్‌లు, స్పోర్ట్స్ డ్రెస్లు, స్పోర్ట్స్ మెటీరియల్, కంప్యూటర్ ఇస్తూనే ఉన్నారన్నారు. ఇనాయత్ నగర్, అమీర్ నగర్ పాఠశాలలకు అవసరమైన డ్రెస్‌లు, స్పోర్ట్స్ మెటీరియల్ ఆయన ద్వారా అందజేయడానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఆయన విద్యార్థులు, నాయకులతో కలిసి వాలీబాల్ ఆడి క్రీడలను ప్రారంభించారు. విద్యార్థుల మార్చ్ ఫాస్ట్, కస్తూర్బా గాంధీ విద్యార్థినుల నృత్యాలు, ప్రదర్శన ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్, తహసిల్దార్ ఆంజనేయులు, మండల విద్యాధికారి ఆంధ్రయ్య, క్రీడల కన్వీనర్ పసుపుల సాయన్న, క్రీడల ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగభూషణం, ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మార్చ్ ఫాస్ట్ విజేతలకు బహుమతుల ప్రధానం

మండల అంతర్ పాఠశాలల క్రీడోత్సవాల్లో భాగంగా నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన పాఠశాలలకు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి షీల్డ్‌లను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో కమ్మర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ బహుమతి గెలుచుకోగా, బషీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ద్వితీయ బహుమతి, చౌట్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తృతీయ బహుమతిని, ఉప్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కన్సోలేషన్ బహుమతి గెలుచుకున్నాయి. ప్రైవేట్ పాఠశాలల విభాగంలో శ్రీ విద్యా సాయి ఉన్నత పాఠశాల ప్రథమ బహుమతిని, విజ్ఞాన జ్యోతి ఉన్నత పాఠశాల ద్వితీయ, మిసిమి ఉన్నత పాఠశాల తృతీయ బహుమతిని గెలుచుకున్నాయి.

ఉత్తర తెలంగాణ స్థాయి బ్యాడ్మింటన్ విజేతలకు అభినందన

మంచిర్యాల జిల్లాలో నిర్వహించిన ఉత్తర తెలంగాణ స్థాయి లెవెల్ బ్యాడ్మింటన్ టోర్నీలో విజేతలుగా నిలిచి ద్వితీయ బహుమతి పొందిన పెంట కిషన్, ఏలేటి మోహన్ రెడ్డిని రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అభినందించారు. గురువారం మండల కేంద్రంలోని గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియంలో వారు రెడ్డి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సన్మానించారు.

సీరియల్ నెంబర్ ప్రకారం వడ్లు కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న చైర్మన్ గంగారెడ్డి

నవతెలంగాణ-మోపాల్

మోపాల్ వ్యవసాయ పరపతి సంఘంలో చైర్మన్ గంగారెడ్డి అధ్యక్షతన మహాజన సభ గురువారం నిర్వహించారు. సి ఇ ఓ సాయి చంద్ లావాదేవీలనే చదివి వినిపించారు. మోపాల్ సొసైటీ పరిధిలో 8 గ్రామాలు న్నాయి. కొందరు డైరెక్టర్లు గైర్హాజరు అవడంతో అక్కడికి వచ్చిన రైతుల ఆగ్రహం వ్యక్తం చేశారు. మహాజన సభకు రావడానికి తీరిక లేనప్పుడు వారు డైరెక్టర్లు ఉండడానికి వీలులేదని అన్నారు. అలాగే కొందరు డైరెక్టర్లు వడ్లు కొనే సమయంలో సీరియల్ తో సంబంధం లేకుండా తమ సంబంధించిన వ్యక్తులకు ముందుగా వడ్లను కాటా చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. ఇప్పటికైనా వడ్ల కొనుగోలు విషయంలో రాజకీయాలకు తావివ్వకుండా సీరియల్ ప్రకారం కొనుగోలు చేయాలని కోరారు. లారీ డ్రైవర్లు తమ దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారని, కొందరు రైతులు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారన్నారు. దీనికి చైర్మన్ స్పందిస్తూ ఎవరు డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని తెలిపారు. అలాగే దాదాపు 70 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ఫంక్షన్ హాల్లో నిరుపయోగంగా ఉందని, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారుతుందని దానికి మరమ్మత్తులు చేయాలని కూడా తీర్మానం చేశామన్నారు. సొసైటీకి పెద్ద భారంగా ఉందని, 70 లక్షల రూపాయలను అప్పటి చైర్మన్ నిర్లక్ష్యంతో కట్టించి ప్రజాధనం దుర్వినియోగం చేశాడని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ తిరుపతి మాట్లాడుతూ తమ సిర్పూర్ గ్రామంలో కూడా గోదాం కావాలని ఆయన చైర్మన్ దృష్టికి తీసుకు వచ్చారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ తిరుపతి, మాజీ చైర్మన్ ఉమాపతిరావు, డైరెక్టర్లు రాజశేఖర్ రెడ్డి, అంగలి లక్ష్మి, గంగాధర్ పాల్గొన్నారు.

28న 'దిశా' సమావేశం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ (దిశా) కమిటీ సమావేశం ఈ నెల 28న సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని డీఆర్డీఓ సాయాగౌడ్ తెలిపారు. నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు అరవింద్ ధర్మపురి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం వివిధ పనుల కోసం ఆయా శాఖలకు కేటాయించిన నిధులు, వాటి వినియోగంపై సమీక్ష నిర్వహిస్తారని అన్నారు. కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని డీఆర్డీఓ కోరారు.

మండల అంతర్ పాఠశాలల క్రీడల్లో జిల్లా పరిషత్ హైస్కూల్ తొర్లికొండ క్రీడాకారుల ప్రతిభ



బహుమతులు అందుకున్న విద్యార్థులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఈనెల 23 నుండి 25 వరకు జరిగిన మండల అంతర్ పాఠశాల క్రీడోత్సవాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొర్లికొండ విద్యార్థులు పాల్గొని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మార్చ్ ఫాస్ట్ విభాగంలో ప్రథమ బహుమతిని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే శ్రీ భూపతి రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. అలాగే అండర్-17 బాలుర కబడ్డీ విభాగంలో ద్వితీయ బహుమతి, అండర్ 14 బాలుర వాలీబాల్ విభాగంలో ద్వితీయ బహుమతి, అండర్ 17 బాలుర వాలీబాల్ విభాగంలో తృతీయ బహుమతి, అండర్ 14 బాలుర కబడ్డీ విభాగంలో తృతీయ బహుమతులను ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథి జక్రాన్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ చేతుల మీదుగా అందుకున్నట్లు ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి, తొర్లికొండ గ్రామస్పెషల్ ఆఫీసర్ ఎం. శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. క్రీడాకారులు చక్కగా రాణించి బహుమతులు సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ మున్ముందు జిల్లా, రాష్ట్ర జాతీయ పోటీల్లో పాల్గొనేలా శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఇందుకు కృషిచేసిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగా మోహన్ అభినందించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వీడీసి అధ్యక్షుడు వెంకట్, తెడ్డు మైపాల్ కుమార్, మనోహర్, వీడీసీ సభ్యులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, గంగారెడ్డి, గ్రామ యువకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సన్నాలతోపాటు దొడ్డువరికి బోనస్ ఇవ్వాలి

- ఎన్నికల హామీలను అమలు చేయాలి
- ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు సారా సురేష్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్నట్లుగా సన్న ధాన్యానికి, దొడ్డు ధాన్యాన్నికి రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సారా సురేష్ డిమాండ్ చేశారు. పత్తిని సిసిఐ ఆధ్వర్యంలో తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి రూ.15వేల మద్దతు ధరతో కొనుగోలు చేయాలన్నారు. పత్తికి రూ.500 బోనస్ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ మొదటి వారం నుండి రాష్ట్రంలో 7139 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు ప్రారంభిస్తున్నట్లు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దొడ్డు ధాన్యం 23లక్షల 58వేల ఎకరాల్లో సాగయిందని, 58లక్షల 18వేల టన్నులు దొడ్డు ధాన్యం దిగుబడి వస్తుందని మంత్రి ప్రకటించారన్నారు. దొడ్డు ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వకుండా రైతులకు ఎగనామం పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందన్నారు. సన్న ధాన్యాలను కొనుగోలు చేస్తామని అందుకు క్వింటాల్‌కు రూ.500 రూపాయలు బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లుగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి ప్రకటించారని పేర్కొన్నారు. ధాన్యం మద్దతు ధరకు అదనంగా రూ.500 ఇస్తామని, 10 పంటల పేర్లను కూడా ప్రకటించారని గుర్తు చేశారు. ఇందిరమ్మ రైతు భరోసా ఎకరాన రూ.15వేలు అతి గతి లేదన్నారు. వర్షాల మూలంగా తేమశాతం 10 నుంచి 15 వరకు ఉన్న సీసీఐ క్వింటాల్‌కు రూ.15వేల చొప్పున చెల్లించి తప్పనిసరిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్లుగా పత్తికి క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వాలని, వర్షంలో తడిసిన పత్తి, పెసర, మొక్కజొన్న, తదితర పంటలను ఎలాంటి కొర్రీలు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం కమ్మర్ పల్లి మండల అధ్యక్షులు ఉట్నూర్ బాలయ్య, కార్యదర్శి బి. అశోక్, కార్యవర్గ సభ్యులు ఉట్నూర్ అశోక్, బాలకిషన్, పిటడబ్ల్యు నాయకురాలు సత్యక్క, తదితరులు పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్ పాఠశాలకు ఐదు బహుమతులు



ట్రోఫీలు గెలుకున్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ శివారులోని గాంధీ నగర్‌లోగల ఆక్స్‌ఫర్డ్ పాఠశాల విద్యార్థులు మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జరిగిన మండల స్థాయి క్రీడా పోటీల్లో ఐదు విభాగాల్లో బహుమతులు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్ గురువారం తెలిపారు. మార్చ్ ఫాస్ట్ పోటీల్లో మొదటి బహుమతి సాధించగా ఖోఖో సబ్ జూనియర్ బాలుర విభాగంలో మొదటి బహుమతి, కబడ్డీ సబ్ జూనియర్ బాలుర విభాగంలో మొదటి బహుమతి, ఖోఖో సబ్ జూనియర్ బాలికల విభాగంలో ద్వితీయ బహుమతి, కబడ్డీ సబ్ జూనియర్ బాలికల విభాగంలో ద్వితీయ బహుమతులు సాధించారు. శ్యాంసుందర్ అనే విద్యార్థి కబడ్డీలో ఉత్తమ రైడర్ అవార్డును కైవసం చేసుకున్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన డిచ్పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్, మండల విద్యాశాఖ అధికారి ఎం.శ్రీనివాస్ చేతుల మీదుగా విద్యార్థులు బహుమతులు అందుకున్నారు. పాఠశాల పాలనాధికారిణి పద్మ మాట్లాడుతూ.. తమ పాఠశాల విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ రాణించడం గర్వంగా ఉందని అన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు శివ సాయి, నిఖిల్ విద్యార్థులకు ఆటల్లో మెళకువలు నేర్పించగా విద్యార్థులు ప్రతినిత్యం అభ్యాసం చేయడం వల్ల బహుమతులు సాధించడం సాధ్యం అయిందని వారు అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

గాజుల్ పేట్ 50 వ డివిజన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొని భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపల్ జనరల్ ఫండ్‌కు సంబంధించి 10లక్షల రూపాయల నిధులతో 50 డివిజన్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. జనరల్ ఫండ్ కింద ప్రతి డివిజన్‌కు రూ.10 లక్షలు మంజూరయ్యాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన పదినెలల్లో ఒక్క రూపాయి అభివృద్ధికి ఇవ్వలేదని, సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడం జరిగిందన్నారు రాష్ట్ర ఖజానా మొత్తం కాంగ్రెస్ ముఖ్య నాయకుల నియోజకవర్గాల అభివృద్ధికి పోతున్నాయన్నారు. కానీ నిజామాబాదు జిల్లాకు ఒక్క రూపాయి కూడా రావడం లేదన్నారు. నగరంలో పలు సమస్యలపై ముఖ్యమంత్రికి, ఇంచార్జ్ మంత్రికి లేఖలు రాశానని అన్నారు. ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా అభివృద్ధి పనులకు ఇవ్వలేదని అన్నారు. నగరంలో ఉన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై వివరంగా ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారనికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మేయర్ నీతు కిరణ్, కార్పొరేటర్ బట్టు రాఘవేందర్ (రాము), మున్సిపల్ అధికారులు, సిబ్బంది, బీజేపీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలో స్వచ్ఛత హి సేవ మిషన్‌లో భాగంగా సర్కిల్ నెంబర్ 1లో కమర్షియల్, ప్రజలకు చెత్త బయట, మోరీలో పారెయ్యకుండా తడి చెత్త పొడి చెత్త వేరు చేస్తూ నగరపాలక సంస్థ వాహనానికి ఇవ్వాలని గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా దుకాణాదారులకు గులాబీ పువ్వులు ఇస్తూ అవగాహనర కల్పించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, కార్మికులు, కార్పొరేటర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, జవాన్‌లు, పంచరెడ్డి ప్రవళిక శ్రీధర్, ఎర్రం సుధీర్ పాల్గొన్నారు.

నీటి సహాయకులకు శిక్షణ తరగతులు

నవతెలంగాణ-బాల్కొండ

మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని నీటి సహాయకులకు నేటి నుంచి 4 రోజుల పాటు మండల కేంద్రంలోని రైతు వేదికలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు మిషన్ భగీరథ ఏఈ బసవరాజ్ గురువారం తెలిపారు. నీటి సహాయకులకు శిక్షణలో భాగంగా చేతి పంపులు రిపేర్, మోటార్ రిపేర్, ప్యానల్ బోర్డ్ రిపేర్, పైపులైన్‌ల రిపేర్లు, నీటి నాణ్యత ప్రమాణాలపై శిక్షణ ఇచ్చారని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | సెప్టెంబర్ 27, 2024 | www.navatelangana.com

విద్యావంతులు ఎన్నికల్లో గెలిస్తే అభివృద్ధి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



రాజకీయాల్లో చదువుకున్న మేధావులు, విద్యావేత్తలకు అవకాశం కల్పిస్తే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తనను గెలిపించాలని కోరారు. విద్యావంతులు ఎన్నికల్లో గెలిస్తే ప్రజల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

- కాపాడిన రైల్వే పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో రైల్వే ట్రాక్‌పై వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన నిజామాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయిరెడ్డి వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మాచారెడ్డికి చెందిన తోమాటి ప్రియాంకకు ఐదేళ్ల క్రితం బాన్సువాడకు చెందిన సంతోష్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా కొంతకాలంగా భర్త వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకుంది. గురువారం తండ్రికి ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపింది. దీంతో వెంటనే తండ్రి బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు మొబైల్ నెంబర్ ద్వారా ట్రాక్ చేయగా నిజామాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తించారు. వెంటనే రైల్వే ఎస్ఐకి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది రవికుమార్ గురుదాస్, సుధీర్, సుప్రియ తదితరులు ఘటనా స్థలానికి చేరుకునీ. రైల్వే ట్రాక్‌పై ఉన్న మహిళను రక్షించారు. అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

మహిళా చైతన్యానికి ప్రతీక వీరనారి ఐలమ్మ

- రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి
- ధీర వనిత చిట్యాల ఐలమ్మకు ఘన నివాళులు

నవతెలంగాణ-విలేకరులు

తెలంగాణ పోరాట యోధురాలు చాకలి చిట్యాల ఐలమ్మ జయంతి సందర్భంగా పలు సంఘాలు, పార్టీల నాయకులు పూలమాలలువేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా ఆమె వెట్టి చాకిరికి వ్యతిరేకంగా, బానిసత్వ విముక్తి కోసం పోరాడిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ధీర వనిత వీరణారీ ఐలమ్మ అని కొనియాడారు.

వేల్పూర్ (కమ్మర్‌పల్లి): మహిళా చైతన్యానికి ప్రతీక వీరణారీ ఐలమ్మ అని రాష్ట్ర మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం వేల్పూర్ మండల కేంద్రంలో చిట్యాల ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నాటి తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ప్రదర్శించిన ధైర్య సాహసాలు, చైతన్యం నేటి తరానికీ ఎంతో స్ఫూర్తి అన్నారు. ఆమె పోరాట స్ఫూర్తిని తీసుకొని ప్రజల పక్షాన పోరాడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..

కంఠేశ్వర్ : జిల్లా కేంద్రంలోని వీరనారి ఐలమ్మ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జి గంధమాల నాగభూషణం మాదిగ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు గురువారం అర్పించారు. కార్యక్రమంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు మల్లని శివ మాదిగ, ఎంఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి దారి హరీష్ మాదిగ, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

వీరణారీ ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరాలకు ఆదర్శమని బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్‌కుమార్ తెలిపారు. హనుమాన్ జంక్షన్‌లోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బిసి ఉపాధ్యాయ సంఘం నాయకులు రామకృష్ణ, కొట్టూరు రమేష్, రమణ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆంజనేయులు, దర్శనం దేవేందర్, శంకర్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో చిట్యాల ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా తెలంగాణ బీసీ మహాసభ నిజామాబాదు జిల్లా అధ్యక్షులు ఆదే ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమం లో తెలంగాణా బీసీ మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు ఈర్ల శేఖర్, జిల్లా కార్యదర్శి గుడ్డెం శ్యామ్ కుమార్, నగర ఉపాధ్యక్షులు వేముల దేవిదాస్, నగర కార్యదర్శి గుడ్డెం వినోద్ తదితరులు పాల్గొన్నారు.



కంఠేశ్వర్: ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పోలీసులు



లింగంపేట్: ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసిన ఎమ్మెల్యే

మోపాల్ : మండలంలోని మంచిప్ప గ్రామంలో గ్రామస్తులు ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నందిపేట్ : మండల కేంద్రంతోపాటు వెల్మల్ గ్రామంలో మండల రజక సంఘం, రైతు కూలీ నాయకులు, పలుపార్టీల నాయకులు ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు..

జక్రాన్‌పల్లి : మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో రజక కులస్తులు ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాగర్, రాజేశ్వర్, రాజగంగారాం, నారాయణ, అజయ్, తిరుపతి, సుమన్, ముత్తెన్న పోషన్న, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వినాయకనగర్ విగ్రహాల పార్కులో ఇందూర్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ఐలమ్మ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతు ఆనాడు నిజాం నిరంకుశ పాలనలో దొరలు, భూస్వాములు, పెత్తందారులు బడుగు, బలహీన వర్గాల ప్రజలను వెట్టిచాకిరీ చేపిస్తు బానిసలుగా చూస్తున్న రోజుల్లో భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం దున్నేవాడిదే భూమి అంటు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా విస్నూర్ దేశ్‌ముఖ్‌ను ఎదిరించిన తెలంగాణ వీర వనిత ఐలమ్మ అని అన్నారు. బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : మండల కేంద్రంలోని పసుపు పరిశోధన స్థానంలో పసుపు పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మహేందర్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఐలమ్మ పోరాట పటిమను తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త శ్రీనివాస్, భాస్కర్, సుభాష్, శంకర్, మహిళ కూలీలు పాల్గొన్నారు.

ఆర్మూర్ : పట్టణంలోని ధోబి ఘాట్ వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి పలువురు పూలమాలను వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి మున్సిపల్ చైర్ ర్సన్ అయ్యప్ప శ్రీనివాస్, బిజెపి అధికార ప్రతినిధి జెస్సు అనిల్ కుమార్ మాట్లాడుతూ.... తెలంగాణ స్వతంత్రం కోసం రజాకారులను తరమడం కోసం పులిలా రజాకారులను ఎదిరించిన ధీర వీరవనిత ఐలమ్మ అని అన్నారు. చాకలి ఐలమ్మ పేరును కోటి లోని మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టడాన్ని స్వాగతిస్తూ న్నామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సాయిబాబా గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్న, కౌన్సిలర్లు చాలా ప్రసాద్, ఆకుల రాము, చందు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ(నసురుల్లాబాద్)

నిజాం పాలకులు, రజాకార్ల పైశాచికత్వాలపై అలుపెరుగని పోరాటం చేసిన యోధురాలు చిట్యాల ఐలమ్మ అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా బాన్సువాడ పట్టణంలోని తడ్కోల్ రోడ్డు పక్కన ఉన్న ఐలమ్మ విగ్రహానికి ఆగ్రో సంస్థ చైర్మన్ కాసుల బాలరాజ్, బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి ఐలమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎల్లారెడ్డి : ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు బబ్లు, డివిజనల్ అధ్యక్షులు మరులు సాయిబాబా, ఉపాధ్యక్షులు సాయిలు, మండల అధ్యక్షులు అమృత్, ప్రధాన కార్యదర్శి కుసులకంటి సాయిలు, సాయిబాబా, రమేష్, సామెల్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థి సంఘం..

కామారెడ్డి : జిల్లా కేంద్రంలో ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షులు కుంబాల లక్ష్మణ్ యాదవ్, గిరిజన సంఘం అధ్యక్షులు వినోద్ నాయక్, ఉపాధ్యక్షుడు ఫూల్ సింగ్ రాథోడ్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించిన కామారెడ్డి ఎమ్మెల్యే

కామారెడ్డి మండలం ఎగ్రోజివాడి గ్రామంలో కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణారెడ్డి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

కామారెడ్డి : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ 129వ జయంతి వేడుకల సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం ముందు గల ఐలమ్మ విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎంకే ముజిబొద్దిన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జూకంటి ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పిప్పిరి వెంకటి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మొహమ్మద్ అలీ షబ్బీర్ సూచన మేరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియా చంద్రశేఖర్ రెడ్డి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, వైస్ చైర్‌పర్సన్ ఊర్తుండా వనిత రవి, గడ్డమీది రాణి మహేష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి ప్రతిరూపం ఐలమ్మ అని ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావు అన్నారు. మండలంలోని కోర్పుల్ గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు భాస్కర్, గ్రామ కమిటీ అధ్యక్షులు అంజయ్య, ఉపాధ్యక్షులు బాలయ్య, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పిట్లం : రజాకార్ల అరాచకాలకు ఎదురొడ్డి పోరాడిన గొప్ప ధీర వనిత ఐలమ్మ అని పలువురు కొనియాడారు. మండల పరిషత్ కార్యాలయ ప్రహరీ గోడ ముందు గల ఆర్అండ్‌బి రోడ్డుపై ఐలమ్మ జయంతి వేడుకలలో భాగంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. రజక సంఘం పట్టణ అధ్యక్షులు సాయిలు, ఉపాధ్యక్షులు దుర్గయ్య సలహాదారులు అంబదాస్, శివ, అశోక్ రాజ్, కేసయ్య, సిద్దు, రవి, బాలు, జ్ఞానేశ్వర్, అఖిల్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ : ఐలమ్మ నేటి సమాజంలో యువతకు స్ఫూర్తిదాయకమని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డిప్యూటీ ఇంజినీర్ స్వామిదాస్, ఎంఈవో విజయ్ కుమార్, ఎపిఓ రజని, సీనియర్ అసిస్టెంట్ మాణిక్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పోతంగల్ : మండల కేంద్రంలో ఐలమ్మ జయంతి సందర్భంగా రజకులు వేడుకలు నిర్వహించారు.

గాంధారి : రి మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధారి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి తహసీల్దార్ సతీష్ రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు అలాగే మండల కేంద్రంలోని రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సాయికుమార్, గాంధారి మాజీ సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, మాజీ ఎంపీటీసీలు తూర్పు రాజులు, కామెల్లి బాలరాజ్ నాయకులు పరమేష్, గడ శంకర్, గాండ్ల లక్ష్మణ్, ముస్తఫా తదితరులు ఉన్నారు

సదాశివనగర్ : మండల కేంద్రంతో పాటు పలుగ్రామాల్లో ఐలమ్మ జయంతి వేడుకలను రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తిమ్మజవాడి రాజయ్య, సదాశివనగర్ రజక సంఘం సభ్యులు, మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పాపనొల్ల బీరయ్య, రజక సంఘం జిల్లా కార్యదర్శి కుప్రియల్ సంగయ్య, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య, బిజెపి నాయకులు బుడిగె నరసింహారెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొని నివాళులర్పించారు.

నాగిరెడ్డిపేట్ : పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రభాకర్ చారి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సూపరిండెంట్ వినోద్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

కోటగిరి : ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఎంపీఓ చందర్, రజక సంఘ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, మండల అధ్యక్షుడు ప్యాట్ల పెంటయ్య, గ్రామ ఉపాధ్యక్షుడు రుద్రం శీను, కోశాధికారి కోట్ల సాయిలు, నాయకులు మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ డి సి సి జిల్లా కార్యదర్శి కొట్టం మనోహర్, తెల్ల రవికుమార్, బర్ల మధుకర్, ఏఎంసి చైర్మన్ హనుమంత్, ఉపాధ్యక్షుడు అనిల్, కోటగిరి మేత్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

బోధన్ : ధైర్యశాలి ఐలమ్మ నేటితరం వారందరికి ఆదర్శమని, ఆమే స్ఫూర్తిగా మహిళలు అన్యాయంపై ఉద్యమించాలని ఏఎంసీ చైర్మెన్ అంకు సంధ్యదాము అన్నారు. ఐలమ్మ జయంతిని సాలూర మండల కేంద్రంలో రజకసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగాశంకర్, దాము, సొసైటీ చైర్మెన్ జనార్ధన్, లైబ్రరీ చైర్మెన్ స్వామిగౌడ్, అల్లె రమేష్, రజక సంఘం నాయకులు లక్ష్మణ్, నర్సింలు, అశోక్, రాములు, సంతోష్, సురేందర్, రాజాగౌడ్, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు పాండు, సంజీవ్, వెంకటిపటేల్ గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని 27రేషన్ దుకాణాల యజమానులు నూతన రేషన్ డీలర్ కార్యవర్గం ఎన్నికలు గురువారం పట్టణంలో నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా అబ్దుల్ అజీం, కార్యదర్శిగా కామని నరేష్, కోశాధికారిగా పిప్రి శ్రీనివాస్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. రేషన్ డీలర్లకు ఎలాంటి సమస్యలు ఉన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామన్నారు. నూతన అధ్యక్షుడుగా నన్ను ఎన్నుకునందుకు ప్రతివోక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎమ్మార్వో గజానన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కార్యవర్గానికి ఆయన శుభాకాంక్షలు తెలిపి స్వీట్లను అందజేశారు. కార్యక్రమంలో డీలర్లు బొడ్డు రమేష్, వెంకన్న, గుండెం రమేష్, కిషన్, హర్షద్, ఆశన్న, మగ్గిడి నర్సయ్య సురేష్, రాజలింగం, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారం కోసమే పొలంబాట

నవతెలంగాణ-మోపాల్

చాలామంది రైతులకు నిత్యం తమ పంట పొలాల్లో ఏదో రకంగా విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి. దానిని ఉన్నతాధికారులకు తెలియపరచడం కోసమే పొలం బాట కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందని మోపాల్ విద్యుత్ శాఖ ఏఈ బాబా శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో రోజున రైతుల సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరించే విధంగా పంట పొలాల వద్ద రైతుల కొరకు రైతులు తమ పంట పొలాల్లో విద్యుత్ సంబంధించిన ఏ సమస్య ఉన్న తమ దృష్టికి కానీ తమ లైన్‌మెన్ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఖచ్చితంగా తమ సమస్యలకు పరిష్కారం చూపిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో లైన్‌మెన్ పీర్ సింగ్, రైతులు పునాకర్, సురేష్‌రెడ్డి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తూంపల్లి సహకార సంఘం మహాజనసభ

నవతెలంగాణ-సిరికొండ

సిరికొండ మండలంలోని తోంపెల్లి సహకార సంఘం గురువారం చైర్మన్ రాములు నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. సంగం సీఈవో దేవిలాల్ నివేదికను సభకు జమ ఖర్చుల వివరాలను చదివి వినిపించారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల 24 మంది రైతులకు రుణమాఫీ కాలేదని రైతుల ఆగ్రహించారు, ఆన్లైన్లో ఆధార్ కార్డులు తప్పుగా ఎంట్రీ చేయడం వలన రుణమాఫీ జరగలేదని సహకార సంఘం సిబ్బంది రుణమాఫీల పైన నిర్లక్ష్యం చేయడం వల్లనే ఇలా జరిగిందని అన్నారు. ప్రతి సంవత్సరం ఆదాయానికి సరిపడా ఖర్చులు కూడా చూపిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం లక్షలు ఖర్చుచేసి అందిస్తున్న జల్లెడ యంత్రాలను నిరుపయోగంగా బయట పడేస్తున్నారని మళ్లీ వాటిని మరమ్మత్తులు చేసి ఆ ఖర్చులు రైతుల పైన భారం మోపే విధంగా పనులు చేస్తున్నారని రైతులు వాపోయారు ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రాములు నాయక్, వైస్ చైర్మన్ అబ్బాస్, డైరెక్టర్లు, సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లను మార్చుకుంటే

గుండెపోటుకు దూరంగా ఉండొచ్చు

- మనోరమ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ అజేంద్ర శ్రీకాంత్

నవతెలంగాణ-కంఠేశ్వర్

సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ ఆహారపు అలవాటను, జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉంటే గుండెపోటు సమస్యలకు దూరంగా ఉండవచ్చని మనోరమ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అజేంద్ర శ్రీకాంత్ తెలిపారు. గురువారం మనోరమా హస్పటల్ అధ్వర్యంలో "వాక్ ఫర్ హర్ట్ వాక్ విత్ హర్ట్" పేరిట వాకథాన్ నిర్వహించారు. ఆసుపత్రి నుంచి ప్రారంభమైన వాకథాన్ కోర్టు చౌరస్తా మీదుగా పులాంగ్ చౌరస్తా వరకు సాగింది. ఈ సందర్భంగా కార్డియాలజిస్ట్ డాక్టర్ అజేంద్ర శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రతి ఒకరు తమ తమ ఆరోగ్యాన్నికి ప్రాధాన్యత ఇస్తూనే, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంత ముఖ్యమని గుర్తు చేశారు.గుండె వ్యాధులకు దారితీసే అన్హెల్తీ డైట్స్, శారీరక కార్యకలాపాల లోపం, పొగ తాగడం వంటి ప్రమాదకర కారణాలపై ప్రజలకు వివరించడం తమ లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరూ గుండె ఆరోగ్యాన్ని కాపాడుకునే అలవాట్లను పాటించాలని, నియమిత పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కన్సల్టెంట్ పీడియాట్రిషన్ డాక్టర్ చంద్రశేఖర్, కన్సల్టెంట్ న్యూరో సర్జన్ కట్టా నరసింహ, కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ హరికృష్ణరెడ్డి, డాక్టర్ హితేష్ షొలాని, స్టాఫ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పలువురు

పెండింగ్ జీతాలు వెంటనే అందజేయాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి


గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న సఫాయి, వాటర్, ఎలక్ట్రిషన్, అటెండర్, కారోబర్ లకు పెండింగ్లో ఉన్న జీతాలు వెంటనే ఇవ్వాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు ఆధ్వర్యంలో గురువారం ఎంపిడిఓ రవీందర్ కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జేపీ గంగాధర్ మాట్లాడుతూ.. కార్మికులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని, సరిగా జీతాలు లేక బ్రతకడం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.సిబ్బందికి బాకీ ఉన్న జీతాలు సకాలంలో చెల్లించాలని పేర్కొన్నారు. కార్మికులకు జీతాలు రెండు మూడు రోజులలో అందజేసే విధంగా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేస్తానని ఎంపిడిఓ రవీందర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పివైఎల్ నాయకులు వి సాయినాథ్, జిల్లా ఉపాధ్యక్షులు కార్మికులు సంసోన్, సాయిలు, రాజన్న పాల్గొన్నారు.

స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- యుఎస్ఎఫ్ఐ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని యుఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ యుఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలో దాదాపు 500 మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిద్ధల నాగరాజు, పెద్ది సూరి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో స్కాలర్షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ దాదాపు రూ.8వేల కోట్లు బకాయిలు ఉన్నాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కాలేజీ నుంచి పీజీ స్థాయి కాలేజీ వరకు స్కాలర్షిప్ ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాల్సిన ప్రభుత్వం అనవసరపు పథకాలకు డబ్బు ఖర్చు చేస్తూ విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంలో పడేయడం ఎంతవరకు సమంజసమని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న నాయకులు

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.350 కోట్ల పైనే స్కాలర్షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. బకాయిలను విడుదల చేయాలని, విద్యాశాఖ మంత్రిని నియమించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి పోషమైన మహేష్, జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్, మారుతి, అభిషేక్, జిల్లా సహాయ కార్యదర్శులు వేణురాజు, యుఎస్ఎఫ్ఐ నగర సహాయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మండల విద్యాధికారికి సన్మానం



విద్యాధికారిని సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నూతనంగా మండల విద్యాశాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టిన మండల విద్యాశాఖ అధికారి గేమ్ సింగ్‌ని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ పక్షాన అభినందించారు. ఈ సందర్భంగా టిఆర్టిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బట్టు కృష్ణారెడ్డి, రుద్రంగి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా ఖాళీగా ఉన్న మండల విద్యాశాఖ అధికారి పోస్టులు నూతనంగా ఏర్పడిన ప్రజాప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలతో మండలంలోని నోడల్ అధికారులు, సీనియర్ గెజిటెడ్ ఉపాధ్యాయులతో భర్తీ చేయడం హర్షదాయకమని అన్నారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి 100శాతం అక్షరాస్యత సాధించడానికి కృషి చేస్తానని ఎంఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సాయిలు, శ్రీనివాస్, శ్రావణి, పరమేశ్వర్, సంధ్య, రాజేశ్వరి, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్‌లో ప్రతిభ కనపరిచిన మగ్గిడి పాఠశాల క్రీడాకారులు

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లాస్థాయి డి.శ్రీనివాస్ మెమోరియల్ బాల, బాలికల వాలీబాల్‌లో మండలంలోని మగ్గిడి పాఠశాల క్రీడాకారులు మొదటి స్థానం సంపాదించినట్టు పాఠశాల పి.డి. గడ్డం మధు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ వీడీసీ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిత, తదితరులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిషన్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా సమావేశం బహిష్కరణ

- వివక్ష చూపిస్తున్నారని కార్పొరేటర్ల ఆవేదన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బీజేపీ ఎస్సీ మోర్చా సమావేశాన్ని ఇద్దరు కార్పొరేటర్లు బహిష్కరించారు. గురు వారం నగరంలోని పార్టీ జిల్లా కార్యాల యంలో బీజేపీ ఎస్సీ మోర్చా సమావేశం నిర్వహించారు. దీంతో నగరంలోని కార్పొరేటర్లతో పాటు ఎస్సీ మోర్చా నాయకులు హాజరయ్యారు. కాగా.. కార్పొరేటర్లు సాయివర్ధన్, ఉమారాణి, బట్టు రాఘవేందర్ సమావేశానికి వెళ్లారు. తమను ఎందుకు ఆహ్వానించలేదని ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రశ్నించారు. ఆయన స్పందిస్తూ.. ఆహ్వానం లేనప్పుడు సమావేశానికి ఎందుకు వచ్చారన్నారు. దీంతో ముగ్గురు కార్పొరేటర్లు సమావేశాన్ని బహిష్కరించి బయటకు వచ్చేశారు. అదే సమయంలో అర్బన్ ఎమ్మెల్యే సమావేశానికి రాగా.. విషయం తెలియడంతో వారిని రావాలని ఆహ్వానించారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తమపై వివక్ష చూపిస్తున్నారని.. ఈ విషయం తెలిపినా ఎవరూ పట్టించుకోలేదని కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

30న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి

- ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ-ఆర్మూర్

ఈ నెల 30న చలో హైదరాబాద్ జయప్రదం చేయాలని ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు కోరారు. నందిపేట్ మండలంలోని వెల్మల్ గ్రామంలో పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ నాలుగు లేబర్ కోడ్లను మూడు క్రిమినల్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ ఆపాలని, రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, బీడీ కార్మికులకు 4000 పెన్షన్ వెంటనే అమలు చేయాలని కోరారు. ఆటో కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్లతో ఐఎఫ్టియుల ఆధ్వర్యంలో ఈ నెల 30న భారీ ప్రదర్శన ధర్నాను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్, జిపి నాయకులు చిన్నగంగాధర్, జిపిమరియు ఆటో కార్మికులు బాజన్న, చాంద్ పాషా, మైనుద్దీన్, ఖాసీం, గంగారాం, భాష, తదితరులు పాల్గొన్నారు.